మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 20-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 260 Issue: 260

20 మార్చి 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:24 సూర్యాస్తమయం - సా. 6:23 తిథి విదియ రా. 2:30ం వరకు తరువాత తదియ సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం రేవతి తె. 2:27ం వరకు తరువాత అశ్వని యోగం బ్రహ్మ రా. 10:05 వరకు కరణం భాలవ మ. 3:41 వరకు కౌలవ రా. 2:30ం వరకు వర్జ్యం మ. 3:15 నుండి సా. 4:44 వరకు దుర్ముహూర్తం ఉ. 8:47 నుండి ఉ. 9:35 వరకు మ. 12:47 నుండి మ. 1:35 వరకు రాహుకాలం ఉ. 10:53 నుండి మ. 12:23 వరకు యమగండం మ. 3:23 నుండి సా. 4:53 వరకు గుళికాకాలం ఉ. 7:53 నుండి ఉ. 9:23 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:48 నుండి తె. 5:36 వరకు అమృత ఘడియలు రా. 12:11 నుండి రా. 1:41 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:59 నుండి మ. 12:47 వరకు

Published from Jagitial
Circulated to Telangana



## కవిత పార్టీ సంగతేంది?

### త్వరగా నిర్ణయం తీసుకోవాలి
### ఈసీకి ఢిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. తెలంగాణ ప్రజా జాగృతి పేరిట రాజకీయ పార్టీని తెలుగు సంవత్సరాది ఉగాది రోజున ప్రకటించాలని కవిత భావించారు. అయితే ఈ పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందులు -2 వ పేజీలో...



## అట్టహాసంగా గద్దర్ అవార్డుల ఫంక్షన్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2025' పురస్కారాల ప్రదానోత్సవం హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మార్చి 19, గురువారం సాయంత్రం హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,028 |
| వెండి (గ్రాము): | రూ.2265 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,064 |

## విశ్వవాణి



ఇటలీలోని ట్రెంటో అనే పట్టణంలో ఏటా ఓ ఆసక్తికర పని చేస్తారు. అదేంటంటే.. స్థానిక రాజకీయ నాయకుల్లో ఎవరు అత్యంత చెత్త నిర్ణయం తీసుకున్నారో వాళ్లను ఎంపిక చేసి, ఒక పంజరంలో బంధించి అందరూ చూస్తుండగానే ఒక చల్లని నదిలో ముంచుతారు. పాలనలో జవాబుదారీతనాన్ని పెంచే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వర్తిస్తుంటారు.

# డాడీ.. మోడీ.. చిన్న మోడీ

## నా పోరాటం ఈ ముగ్గురిపైనే

### కాంగ్రెస్ అడ్వాంటేజీ కార్డు.. ఎవరికీ అడ్వాంటేజీగా మారను

## మంచి ముహూర్తంలో పార్టీ ప్రకటన



తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి తెరలేపుతున్న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, తన రాజకీయ అజెండాను స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. తన పోరాటం.. డాడీ (కేసీఆర్), మోడీ (పీఎం నరేంద్ర మోడీ), చిన్న మోడీ (రేవంత్ రెడ్డి???)" లపైనేనని ఆమె సంచలన ప్రకటన చేశారు. కొత్త పార్టీ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే చర్యలు ప్రారంభించానని.. రెండు నెలల్లో కొత్త పార్టీ ఏర్పాటు పూర్తి కానున్నట్లు వెల్లడించారు.

బంజారాహిల్స్–హైదరాబాద్, మార్చి 19 (ఈవార్తలు): పార్టీ స్థాపించిన పుడే తమ అజెండా, లక్ష్యాలను ప్రకటిస్తానని తేల్చి చెప్పారు. సామాజిక తెలంగాణే తమ ధ్యేయమని.. సర్వోదయ తెలంగాణ దిశగా తమ పార్టీ ముందుకు వెళ్తుందని వెల్లడించారు. జాతిపిత మహాత్మా గాంధీ సర్వోదయ సిద్ధాంతాన్ని తాము లోతుగా అధ్యయనం చేస్తున్నామని కల్వకుంట్ల కవిత వివరించారు. ఒక సరైన ముహూర్తం వేళ పార్టీకి సంబంధించిన కీలక వివరాలను అధికారికంగా విడుదల చేయనున్నట్లు కవిత వెల్లడించారు. పార్టీ ఆఫీస్‌ను ఎక్కడ ఏర్పాటు చేయాలి అనే దానిపై స్థలాన్ని కూడా వెతుకుతున్నట్లు తెలిపారు. తాము ఎవరితో రాజీ పడేది లేదని.. తాను పెట్టబోయే కొత్త పార్టీ కచ్చితంగా విజయవంతం అవుతుందని కవిత ధీమా వ్యక్తం చేశారు. శ్రీరామనవమి తర్వాత తన కొత్త పార్టీకి సంబంధించిన ప్రకటన ఉంటుందని పేర్కొన్న కవిత.. అంతకుముందే జాతీయ స్థాయి నేతలను కొందరిని కలవనున్నట్లు చెప్పారు. తనకు ఎంతోమంది జాతీయ స్థాయి నాయకులతో సంబంధాలు తరువాయి 2 వ పేజీలో...




# 14 లక్షల కోట్లు ఆవిరి

### సెన్సెక్స్ 2,497 పాయింట్లు పతనం.. 114 డాలర్లకు క్రూడాయిల్ ధర

భారతీయ స్టాక్ నిమార్కెట్లు గురువారం భారీగా పతనమయ్యాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి దాదాపు రూ.14 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైన గంటలోనే దాదాపు రూ.7.6 లక్షలు మార్కెట్ నష్టపోయింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 2496.89 పాయింట్ల నష్టంతో 74,207.24 వద్ద ముగిసింది. ఒక దశలో సెన్సెక్స్ 2700 పాయింట్ల మేర కనిష్టాన్ని తాకింది.

ముంబై: మరోవైపు నిఫ్టీ కూడా భారీ నష్టాల్ని చవిచూసింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి నిఫ్టీ 775 పాయింట్లు నష్టపోయి 23,002 పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్, నిఫ్టీలు 3.26 శాతం నష్టాల్ని నమోదు చేశాయి. వరుసగా మూడు రోజులు లాభాలు చవిచూసిన మార్కెట్లు నాలుగో రోజైన గురువారం మాత్రం భారీ పతనాన్ని నమోదు చేశాయి. బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల విలువ రూ.438.63 లక్షల కోట్లు ఉండగా, గురువారం దాదాపు రూ.14 లక్షల కోట్లు నష్టపోయింది. మిడిల్ ఈస్ట్‌లో యుద్ధం, గల్ఫ్ దేశాల్లోని చమురు క్షేత్రాలపై ఇరాన్ దాడులు వంటి అంశాలు మార్కెట్‌కు ప్రతికూలంగా మారాయి. ఇదే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ తరువాయి 2 వ పేజీలో...



# రాజుకు, మంత్రులకు లొల్లి!

### ఆధిపత్యం కోసం పోరాటాలు.. ధర్మంగా ఉన్నవారిదే గెలుపు

ఆర్థిక మంత్రికి చిక్కులు తప్పవు.. వ్యవసాయ తల్లిగా తెలంగాణ.. ప్రభుత్వ ఉగాది పంచాంగం

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గురువారం రవీంద్ర భారతిలో ఉగాది వేడుకలు నిర్వహించారు. రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి సహా పలువురు ప్రముఖులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పండితులు బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. పరాభవ నామ సంవత్సరం పేరు వినగానే భయపడాల్సిన పని లేదని అధర్మాత్ములకు పరాభవం.. నీతిగా ఉండే ధర్మాత్ములకు ప్రాభవమే పరాభవన నామసంవత్సరమని అన్నారు.

# భట్టి లెక్కలు నేడే!

## మధ్యాహ్నం 12 గంటలకు బడ్జెట్

హైదరాబాద్, మార్చి 19 (ఈవార్తలు): రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో కీలకమైన ఘట్టానికి ముహుర్తం కుదిరింది. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం శుక్రవారం వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఉదయం బడ్జెట్‌ను ప్రభుత్వం ఆమోదించనుంది. అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసన సభలో మధ్యాహ్నం 12 గంటలకు బడ్జెట్‌ను ప్రవేశ పెడుతారు. శాసన మండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ



ప్రజలకు ఆరు గ్యారంటీల ఆశ చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండోసారి బడ్జెట్ ప్రవేశ పెట్టనుంది. నిరుడు మార్చి 19న రూ. 3.05 లక్షల -2 వ పేజీలో...



# కామ పిశాచి

### 58 మంది మహిళలపై లైంగికదాడి
### జ్యోతిష్యుడి ముసుగులో అఘాయిత్యం

మహారాష్ట్రలోని నాసిక్‌లో ఓ కీచక జ్యోతిష్యుడి గుట్టురట్టయింది. జ్యోతిష్యం, వాస్తు పేరుతో మహిళలను లోబర్చుకుని, లైంగికంగా దోపిడీ చేస్తున్న ప్రముఖ జ్యోతిష్యుడు, రిటైర్డ్ మర్చంట్ నేవీ అధికారి అశోక్ ఖరట్ (67) అలియాస్ 'కెప్టెన్'ను పోలీసులు అరెస్టు చేశారు.

నాసిక్: ఇతని కార్యాలయంలో 58 మంది మహిళలపై లైంగిక దాడికి పాల్పడిన వీడియోలతో కూడిన పెన్‌డ్రైవ్ లభించడం కేసు తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ కేసు దర్యాప్తు కోసం మహారాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. నాసిక్‌లోని కెనడా కార్నర్ ప్రాంతంలో అశోక్ ఖారట్ 'ఓకస్ ప్రాపర్టీ డీలర్స్ అండ్ డెవలపర్స్' పేరుతో తరువాయి 2 వ పేజీలో...



# శాంతి.. శాంతి

### యుద్ధం తగ్గేందుకు చొరవ చూపండి.. ప్రపంచ నేతలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి


పశ్చిమాసియా యుద్ధం తీవ్రరూపం దాల్చుతున్న వేళ భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచ నేతలతో టచ్‌లోకి వెళ్లారు. సౌదీ అరేబియాలోని గ్యాస్ కేంద్రాలపై దాడులతో ప్రపంచ దేశాలకు గ్యాస్ కొరత ఏర్పడనున్న నేపథ్యంలో అందరూ అప్రమత్తం కావాలని మోదీకోరారు. పశ్చిమాసియాలో తక్షణమే శాంతి స్థాపనకు చొరవ చూపాలని ఆయన గురువారం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మన్యుయేల్ మక్రాన్, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, ఒమన్ సుల్తాన్‌ను విజ్ఞప్తి చేశారు.

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్, అమెరికా దాడులకు ప్రతిచర్యగా సౌదీ అరేబియాలోని గ్యాస్ రిఫైనరీ కేంద్రాలపై ఇరాన్ విరుచుకుపడుతోంది. ఫలితంగా ముడి చమురు ధర.. లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ ధరలు ఆకాశాన్నంటేలా ఉన్నాయి. యుద్ధం ఇలానే కొనసాగితే గ్యాస్ సంక్షోభాన్ని ఎదుర్కొవాల్సిన ముప్పు తప్పేలా లేదు. దాంతో.. తక్షణమే పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరత స్థాపనకు కృషి చేయాలని భారత ప్రధాని ప్రపంచ నేతలను కోరారు. ఇదే అంశంపై గురువారం ఆయన ఫ్రాన్స్ అధ్యక్షుడు, మలేషియా ప్రధాని, ఒమన్ సుల్తాన్‌తో ప్రత్యేకంగా మాట్లాడారు. 'నా ప్రియమైన స్నేహితుడు ఎమ్మాన్యుయేల్ మక్రాన్‌తో పశ్చిమాసియా యుద్ధం గురించి మాట్లాడాను. తక్షణమే యుద్ధ తీవ్రతను తగ్గించాల్సిన అవసరముందని, చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం చూపాలనే విషయంపై ఆయనతో తరువాయి 2 వ పేజీలో...

# ఖతార్ ప్లాంట్ ఖతం!

### రాస్ లఫాన్‌పై ఇరాన్ క్షిపణి దాడి.. ఉత్పత్తి బంద్.. భారత్‌పై ప్రభావం!

దోహా: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఖతార్‌లోని అతిపెద్ద లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) ప్లాంట్ అయిన రాస్ లఫాన్‌పై ఇరాన్ క్షిపణి దాడి చేయడంతో అంతర్జాతీయ చమురు, గ్యాస్ మార్కెట్లు అల్లకల్లోలంగా మారాయి. ఈ దాడితో ప్రపంచంలోనే అతిపెద్దదైన ఈ ఎల్ఎన్‌జీ ప్లాంట్‌లో ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా–ఇజ్రాయెల్ దాడులకు -2 వ పేజీలో...



# 'టోల్' తీస్తాం!

## హార్మూజ్ దాటాలంటే కప్పం కట్టాల్సిందే..

### ఇరాన్ మరో సంచలన నిర్ణయం



టెహ్రాన్: తమపై ఇజ్రాయెల్–అమెరికా దాడులకు ప్రతీకారంగా గల్ఫ్ దేశాల్లోని అగ్రరాజ్యం సైనిక స్థావరాలను ఇరాన్ టార్గెట్ చేసుకుంది. ఇదే సమయంలో ప్రపంచ చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హర్మూజ్ తరువాయి 2 వ పేజీలో...

# మీ దగ్గరున్న గ్యాస్ ఎంత?

### పూర్తి వివరాలు అందించాలి.. ఇంధన సంస్థలకు కేంద్రం ఆదేశాలు



దేశంలోని చమురు, గ్యాస్ కంపెనీలద వద్ద ఉన్న నిల్వలు, ఉత్పత్తి, వినియోగం, దిగుమతులకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆయా కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది.

న్యూఢిల్లీ: ఈ మేరకు దేశంలోని చమురు, గ్యాస్ కంపెనీలకు ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా -2 వ పేజీలో...

# రాశి ఫలాలు

20.3.2026

మేషం: బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. సమాజంలో పెద్దల అనుగ్రహంతో కీలకమైన పనులు పూర్తిచేస్తారు. నూతన వ్యాపార ప్రారంభానికి శ్రీకారం చుడతారు. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. వ్యాపారాలు మరింత పుంజుకుంటాయి. వృత్తి ఉ ద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు.

వృషభం: కుటుంబ సభ్యుల అనారోగ్య సమస్యలు మానసికంగా కొంత చికాకు కలిగిస్తాయి. ప్రయాణ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వృత్తి, వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. నిరుద్యోగ ప్రయత్నాలు నిదానంగా సాగుతాయి. నూతన ఋణ ప్రయత్నాలు కలసిరావు. కీలక విషయాలలో అలోచించి ముందుకు సాగాలి.

మిధునం: అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు. మాతృ వర్గ బంధు మిత్రులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారములలో నష్ట సూచనలున్నవి. ఉద్యోగాలలో అధికారులతో వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో మార్గ అవరోధాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్రాలు దర్శించుకుంటారు.

కర్కాటకం: వృత్తి ఉద్యోగమున పని ఒత్తిడి నుండి ఉపశమనం పొందుతారు. బంధు, మిత్రులతో గృహమున సఖ్యతగా వ్యవహరిస్తారు. ఆర్థిక పరిస్థితి మరింత మెరుగుపడుతుంది. చేపట్టిన పనులు ఉత్సాహంగా పూర్తి చేస్తారు. నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు అనుకూల వాతావరణం ఉ ంటుంది.

సింహం: ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా వెయ్యడం మంచిది. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. వృత్తి ఉ ద్యోగములలో బాధ్యతలు నిర్వహించడంలో లోటుపాట్లు కలుగుతాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. నేత్ర సంభందిత సమస్యలు కలుగుతాయి.

కన్య: కుటుంబ సభ్యులతో దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. నిరుద్యోగులకు చాలాకాలంగా ఎదురుచూస్తున్న అవకాశములు అందుతాయి. భాగస్వామ్య వ్యాపారాలకు నూతన పెట్టుబడులు లభిస్తాయి. అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తిచేస్తారు. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. మొండి బాకీలు ఋణాలు తీర్చగలుగుతారు.

తుల: గృహ నిర్మాణ ప్రయత్నాలు వాయిదా వేస్తారు. ఇంటాబయట సమస్యాత్మక వాతావరణం ఉంటుంది. కీలక వ్యవహారాలలో తీసుకున్న తొందరపాటు నిర్ణయాలు నిరాశ కలిగిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో పై అధికారులతో ఊహించని సమస్యలు కలుగుతాయి. సంతాన ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి.

వృశ్చికం: కుటుంబ సభ్యుల ప్రవర్తన కొంత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. కొన్ని పనులు అనుకూలంగా పూర్తిచేస్తారు. ఆర్థికంగా వ్యవహారాలు సంతృప్తి కలిగిస్తాయి. ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన వ్యవహారాల్లో కార్యసిద్ధి కలుగుతుంది. వృత్తి, ఉద్యోగాల్లో ఉత్సాహకర వాతావరణం ఉంటుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

ధనస్సు: మొండి బాకీలు వసూలు అవుతాయి. దైవ సేవ కార్యక్రమాలు నిర్వహించి పెద్దల నుండి ప్రశంసలు అందుకుంటరు. వృత్తి,ఉద్యోగాలలో అనుకూలత పెరుగుతుంది. గృహమున సంతాన వివాహ విషయమై చర్చలు జరుగుతాయి. పాత మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు.

మకరం: ఇతరులతో అలోచించి మాట్లాడటం మంచిది. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఆర్థిక వ్యవహారాలు మరింత నిరాశ కలిగిస్తాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వృత్తి వ్యాపారాలు మందగిస్తాయి. ఉద్యోగాలలో అదనపు పని భారం ఉ న్నప్పటికీ నిదానంగా పూర్తి చేస్తారు.

కుంభం: నిరుద్యోగ ప్రయత్నాలు కలిసిరావు. బంధుమిత్రుల నుండి ఊహించని మాటలు వినవలసి వస్తుంది. దూర ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు చికాకు కలిగిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక సమస్యలు కలుగుతాయి. ఉ ద్యోగమున సహోద్యోగులతో మాటపట్టింపులు కలుగుతాయి.

మీనం: వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. చాలాకాలంగా వేధిస్తున్న స్థిరాస్తి వివాదాల నుండి బయట పడతారు. ఆర్థిక విషయంలో ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. వ్యాపార విషయమై పెద్దల సలహాలు తీసుకోవడం మంచిది. విద్యార్థులకు నూతన అవకాశములు లభిస్తాయి. పుణ్యక్షేత్ర దర్శనం చేసుకుంటారు.

# రాజుకు, మంత్రులకు లొల్లి!

**ఆధిపత్యం కోసం పోరాటాలు**

**ధర్మంగా ఉన్నవారిదే గెలుపు**

**ఆర్థిక మంత్రికి చిక్కులు తప్పవు**

**వ్యవసాయ తల్లిగా తెలంగాణ**

**ప్రభుత్వ ఉగాది పంచాంగం**

హైదరాబాద్, మార్చి 19 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గురువారం రవీంద్ర భారతిలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి సహా పలువురు ప్రముఖులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పండితులు బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. పరాభవ నామ సంవత్సరం పేరు వినగానే భయపడాల్సిన పని లేదని అధర్మాత్ములకు పరాభవం.. నీతిగా ఉండే ధర్మాత్ములకు ప్రాభవమే పరాభవన నామసంవత్సరమని అన్నారు. ఈ ఏడాది పరిపాలనలో ప్రజా సంక్షేమం, భూమి, వ్యవసాయం మొదలైన అంశాల్లో ప్రాధాన్యం పెరుగుతుందని చెప్పారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయరంగం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. ఆర్థిక వ్యవహారాల్లో కొత్త జాగ్రత్త పడాల్సి ఉంటుందని ఈ ఏడాది ఆర్థిక శాఖను చూసే మంత్రికి చిక్కు ఉ ందన్నారు. ఆర్థక విషయాల్లో కఠిన నిర్ణయాలు ఉంటేనే పరిపాలన సవ్యంగా ఉంటుందన్నారు. లేకుంటే ఆర్థికంగా ఇబ్బందులు తప్పవని శాస్త్రం చెబుతోందని అన్నారు. ఆరోగ్యశాఖలో కొంత అద్భుతమైన ప్రక్షాళన జరుగుతుందన్నారు. ప్రజావైద్యం కోసం మంత్రులంతా కంకణం కట్టుకుంటారని.. ఒప్పందాలు, ఇతర రాష్ట్రాలతో నీటి పంపకాల వ్యవహారాల్లో జాగ్రత్తగా అడుగులు వేయాల్సి వస్తుందని చెప్పారు. 'ఈ పరాభవనామ సంవత్సరం ఆధిపత్యం కోసం పోరాటాలు జరుగుతాయి. పరిపాలనలో రాజుకు, మంత్రులకు మధ్య పోరాటాలు ఉంటాయి. ఆధిపత్యాన్ని కోరుకునే వారు ఎక్కువవుతారు. కానీ ధర్మంగా ఉన్నవారు కచ్చితంగా నిలబడి విజయం సాధిస్తారు. ఈ ఏడాది నదులు పుష్కలంగా ప్రవహిస్తూ తెలంగాణను వ్యవసాయ తల్లిగా మార్చి అందరికి కడుపునిండా అన్నం పెట్టి రైతులందరికీ ఆనందం పంచే సంవత్సరంగా ఉ ండబోతుంది. ఈ ఏడాది గురువే రాజుగా ఉన్నారు కాబట్టి ఎప్పుడు మంచిగా ఆలోచించే వారు, మంచి చేయడానికి కంకణం కట్టుకోవడం, నిరంతరం ధర్మాన్ని కాపాడటానికి అస్మదీయులను సైతం పక్కన పట్టి ధర్మనిరంకుశత్వం ఉ ంటే రాజుకు ఈ సంవత్సరం తిరుగు లేదు. ఈ ఏడాది నొసట చిరునవ్వులు ఉ ంటే లోపల అంతా వేరే రకంగా ఉంటుంది. అందువల్ల పాలకుల మధ్య నిత్యం సయోధ్య పెట్టుకోవాల్సి ఉంటుంది. ఇదే నోటిపై కనిపించే చిరునవ్వులను చూసి ఉప్పొంగిపోవద్దు. లోపల చూసి ఆలోచన చేయాలి. ఈ ఏడాది పాడి పంటలు బాగున్నాయి. వర్షాలు బాగున్నాయి. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం మెరుగుపడబోతోంది. రుణాలు చేసి భూములు కొనుగోవద్దు. ఖర్చులు అదుపులో పెట్టుకున్న వారికే ఈ సంవత్సంరం బాగుటుంది. ఇక ఈసారి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. 50 డిగ్రీలు అనేది సాధారణం అయిపోతుంది.' అని పంచాంగ శ్రవణంలో వెల్లడించారు.



# కామ పిశాచి

కార్యాలయం నడిపేవాడు. తనను తాను 'కెప్టెన్' అని, ఆధ్యాత్మిక శక్తులు ఉన్నాయని ప్రచారం చేసుకునేవాడు. వివాహ సమస్యలతో బాధపడుతున్న 35 ఏళ్ల మహిళ ఒకరు 2022లో ఇతడిని సంప్రదించింది. ఆమె భర్తకు ప్రాణగండం ఉందని, ప్రత్యేక పూజలతో దానిని నివారిస్తానని నమ్మబలికాడు. అనంతరం ఆమెకు మత్తుమందు కలిపిన పానీయం ఇచ్చి, హిప్నటైజ్ చేసి, భయపెట్టి 2025 డిసెంబర్ వరకు పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన నాసిక్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు, కారట్ ఫార్మ్‌హౌస్‌పై దాడి చేసి చాకచక్యంగా అతడిని అరెస్టు చేశారు. ఈ సోదాల్లో ఒక పిస్టల్, బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతని కార్యాలయంలో రహస్యంగా అమర్చిన సీసీటీవీ కెమెరాలను గుర్తించారు. అక్కడ లభించిన ఒక పెన్‌డ్రైవ్‌లో 58 మంది వేర్వేరు మహిళలపై లైంగిక దాడి చేస్తున్న వీడియోలు ఉండటంతో పోలీసులు నిర్ఘాంతపోయారు. మత్తుమందులు, చేతబడి వంటివి ప్రయోగించి మహిళలను లొంగదీసుకుని, ఆ దృశ్యాలను రికార్డు చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ కేసులో రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖులతో ఖారట్‌కు సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రూపాలి చకణ్‌కర్‌పై కూడా విమర్శలు రావడంతో ఈ కేసు రాజకీయంగానూ దుమారం రేపింది. దీంతో ప్రభుత్వం ఐపీఎస్ అధికారిణి తేజస్వినీ సత్పుతే నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ అధికారులు వీడియోలను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపి, ఇతర బాధితులను గుర్తించే పనిలో పడ్డారు. నిందితుడిపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 64 (రేప్), బ్లాక్ మ్యాజిక్ చట్టం కింద కేసులు నమోదు చేసిన పోలీసులు, అతడిని కోర్టులో హాజరుపరచగా మార్చి 24 వరకు కస్టడీకి అప్పగించారు.

# 'టోల్' తీస్తాం!

జల సంధిని నియంత్రిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా, ఈ జల సంధిలో నౌకల రవాణాపై ఇరాన్ మరో కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్టు సమాచారం. జల మార్గం గుండా రాకపోకలు సాగించే నౌకలు ఇకపై కొంత ఫీజుగా చెల్లించాల్సి రావొచ్చని భోగట్టా. ఆయిల్ ట్యాంకర్లపై టోల్ ఫీజు విధించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ఇరాన్ చట్టసభ సభ్యుడు సొమాయే రఫీయే తెలిపారు. స్థానిక మీడియాతో సొమాయే మాట్లాడుతూ.. రవాణా, ఇంధనం, ఆహార భద్రత కోసం సురక్షిత మార్గంగా కోసం హార్మూజ్ జల సంధిని ఉపయోగించుకునే దేశాలు టోల్ ఫీజులు చెల్లించేలా బిల్లును తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. తమ శక్తి సామర్థ్యాలతో జల సంధిలో భద్రత కల్పిస్తామని, దానికి ప్రతిఫలంగా దేశాలు కొత్త మొత్తం చెల్లించాలని ఆమె అన్నారు. "యుద్ధం ముగిసి సాధారణ పరిస్థితులు నెలకున్న తర్వాత హార్మూజ్ జల సంధి రవాణాలో కొత్త విధివిధానాలు రాబోతున్నాయి. మాపై ఆంక్షలు విధించిన దేశాల పై మేమూ అటువంటి చర్యలే తీసుకునేలా నిర్ణయాలు ఉంటా యి" అని ఇప్పటికే ఇరాన్ ప్రకటన చేసింది. ఇదిలా ఉండగా అమెరికా, ఇజ్రాయెల్ ట్యాంకర్లకు మాత్రమే హార్మూజ్‌ను మూసివేసినట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఇటీవల వెల్లడించారు. ఇతర దేశాల నౌకలకు ఎటువంటి ఆటంకం కల్పించబోమని, అవి స్వేచ్ఛగా ప్రయాణించవచ్చని ఆయన చెప్పారు. మరోవైపు, గల్ఫ్ దేశాల్లో చమురు, గ్యాస్ ఫీల్డ్‌లపై బుధవారం అర్ధరాత్రి నుంచి నుంచి ఇరాన్ భీకర దాడులు చేస్తోంది. తమ సౌత్ పార్స్ గ్యాస్ ఫీల్డ్‌పై ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా ఇరాన్ ఈ చర్యలకు దిగినట్లు తెలిపింది. దీంతో యుద్ధం మరో మలుపు తిరిగింది. సహనాన్ని చేతగానితనంగా భావించొద్దని ఇరాన్‌కు సౌదీ అరేబియా హెచ్చరించింది. ఖతార్‌లోని రాస్ లఫాన్ గ్యాస్‌పై దాడితో అక్కడ ఉత్పత్తి నిలిచిపోయింది. ఐదేళ్ల తర్వాత ఆ ఫీల్డ్‌లో ఉత్పత్తి నిలిచిపోవడం మొదటిసారి. ఈ కేంద్రంలో అమెరికాకు చెందిన ఎక్సాన్‌మొబిల్, చెవ్రాన్, యూకే సంస్థ షెల్ వంటి సంస్థలు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి.



# 14 లక్షల కోట్లు ఆవిరి

మొదటి పేజీ తరువాయి

బ్యాంక్ తాత్కాలిక చైర్మన్ అతాను చక్రవర్తి రాజీనామా చేయడంతో ఆ బ్యాంకు షేర్లు దాదాపు 9 శాతం పతనమయ్యాయి. ఇది కూడా మార్కెట్‌పై ప్రభావం చూపించింది. మరోవైపు అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు భారీగా పెరుగుతున్నాయి. గురువారం బ్యారెల్ క్రూడాయిల్ ధర 114 డాలర్లకు చేరింది. యుద్ధానికి ముందు 90 డాలర్ల వద్ద ఉన్న చమురు ధర ఇప్పుడు గణనీయంగా పెరిగింది. అలాగే అమెరికన్ ఫెడరల్ బ్యాంక్ నిర్ణయం కూడా మార్కెట్‌ను ప్రభావితం చేసింది. ఉద్రిక్తతల వేళ కూడా ఫెడరల్ బ్యాంక్ వడ్డీ రేట్లను సవరించకపోవడం ప్రతికూలంగా మారింది.

# మీ దగ్గరున్న గ్యాస్ ఎంత?

మొదటి పేజీ తరువాయి

ఇంధన కొరత ఆందోళన నెలకొంది. దేశంలో ఇంధన, గ్యాస్ కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తోంది. ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పెట్రోల్, సహజవాయువు సరఫరా గొలుసును పర్యవేక్షించేందుకు ఒక కేంద్రీకృత వ్యవస్థను ఏర్పాటు చేసే ఉ ద్దేశంతో ఈ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయా కంపెనీలు పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలసిస్ సెల్‌కు వివరాలు అందించాలని సూచించింది.

# ఖతార్ ప్లాంట్ ఖతం!

మొదటి పేజీ తరువాయి

ప్రతీకారంగా ఇరాన్ ఈ చర్యలకు పాల్పడుతోంది. ఇప్పటికే పశ్చిమాసియాలో అమెరికా ఆస్తులతో పాటు, ఇంధన ఉత్పత్తి కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దాడులు చేస్తోంది. ఈ నెల ప్రారంభంలో కూడా ఖతార్ గ్యాస్ క్షేత్రాలపై ఇరాన్ క్షిపణి దాడులు చేయడంతో ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ ఎగుమతిదారు అయిన ఖతార్ ఎనర్జీ ఉత్పత్తిని నిలిపివేసింది. తాజా పరిణామాలతో హార్మూజ్ జలసంధి యుద్ధ క్షేత్రంగా మారింది. ప్రపంచంలోని ఐదో వంతు చమురు రవాణా జరిగే ఈ మార్గంలో దాడుల భయంతో రాకపోకలు దాదాపుగా స్తంభించిపోయాయి. దీంతో 700కు పైగా కార్గో నౌకలు సమీపంలోని సురక్షిత ప్రాంతాల్లో నిలిచిపోయాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఈ సంక్షోభం భారత్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. భారత్ తన సహజ వాయువు అవసరాల్లో దాదాపు 50 శాతం అంతర్జాతీయ మార్కెట్ల నుంచే సమకూర్చుకుంటోంది. ఇందులో ముఖ్యంగా ఖతార్ నుంచి 40 శాతం ఎల్ఎన్‌జీని దిగుమతి చేసుకుంటోంది. అంటే, మన దేశ మొత్తం గ్యాస్ అవసరాల్లో దాదాపు 20 శాతం ఖతార్ నుంచే వస్తోంది.



# డాడీ.. మోడీ.. చిన్న మోడీ

మొదటి పేజీ తరువాయి

ఉన్నాయని.. వారి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తానని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించేందుకు చేపట్టిన ఉద్యమంలో పోరాటం చేసిన యువతకు తమ పార్టీలో అవకాశం కల్పిస్తానని ప్రకటించారు. ఇక, బీఆర్ఎస్ పార్టీతో తనకు ఉన్న విభేదాలను సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు తమకు అనుకూలంగా (అడ్వాంటేజ్) మార్చుకుంటున్నారని కవిత విమర్శించారు. అసెంబ్లీలో సైతం తన ఇష్యూను వాడుకుంటూ రాజకీయం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. తానెవరికీ అడ్వాంటేజీగా మారబోనని తేల్చిచెప్పారు. ఇక, ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ అనే తేడా లేకుండా రాష్ట్రవ్యాప్తంగా తనను పోటీ చేయాలని కోరుతున్నారని కవిత పేర్కొన్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో కొత్త పార్టీ ప్రభావం బలంగా ఉంటుందని, ఇటీవలే వనపర్తి నుంచి పోటీ చేయాలని జాగృతి కార్యకర్తలు కోరారని పేర్కొన్నారు.

# కవిత పార్టీ సంగతేంది?

మొదటి పేజీ తరువాయి

ఎదురవుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో కవిత తన కొత్త పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఈసీ వద్ద దరఖాస్తు చేసుకున్నారు. ఈసీ నుంచి స్పందన రాకపోవడంతో ఆమె కొద్దిరోజుల క్రితం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పార్టీ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఈసీ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. కవిత పిటిషన్‌పై గురువారం ఢిల్లీ హైకోర్టులో విచారణ జరిగింది. 'తెలంగాణ ప్రజా జాగృతి'పై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఈసీకి హైకోర్టు సూచించింది. కవిత దరఖాస్తులో లోపాలు ఉన్నాయని గతంలో కోర్టుకు ఎన్నికల కమిషన్ తెలిపింది. అయితే ఈ లోపాలను సరిచేసినట్లు కవిత తరఫు న్యాయవాదులు హైకోర్టుకు తెలిపారు. సాంకేతిక తప్పులను సరిచేసి ఈసీకి మళ్లీ దరఖాస్తు చేశామని కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, కవిత పార్టీపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇందుకు ఈసీ అంగీకరించడంతో కోర్టు విచారణను ముగించింది.

# భట్టి లెక్కలు నేడే!

మొదటి పేజీ తరువాయి

కోట్లతో వార్షిక బడ్జెట్‌ను శాసన సభ ముందుంచిన ఉపముఖ్యమంత్రి భట్టి.. ఈసారి ఏం లెక్కలు వేసుకొని వచ్చారన్నది ఆసక్తిగా మారింది. అభివృద్ధి, సంక్షేమానికి భారీగా కేటాయిస్తారా? అన్నది తేలిపోనుంది.

# శాంతి.. శాంతి

మొదటి పేజీ తరువాయి

చెప్పాను. ఆ ప్రాంతంలో శాంతి స్థాపనకు, సుస్థిరత నెలకొనేందుకు అవసరమైన సాయం చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని వివరించాను' అని మోదీతన ఎక్స్ పోస్ట్‌లో వెల్లడించారు. నా స్నేహితుడు, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో మాట్లాడాను. హరి రయా ఐదిల్‌ఫిత్రి పండుగను పునస్కరించుకొని ఆయనకు, మలేషియా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశాను. అనంతరం.. ప్రపంచాన్ని కలవరపరుస్తున్న పశ్చిమాసియాలో యుద్ధం గురించి ద్దరం చర్చించాం. చర్చల ద్వారా, రాయబారం ద్వారా ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలను తగ్గించడానికి, వీలైనంత తొందరగా శాంతి స్థాపనకు, సుస్థిరత నెలకొల్పడానికి కృషి చేయాల్సిన అవసరముందని ఇరువురం భావించాం అని మోదీతన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'నా సోదరుడు సుల్తాన్ హైథమ్ బిన్ తారీఖ్‌తో సంభాషణ అర్థవంతంగా సాగింది. ఒమన్ ప్రజలకు ఈద్ శుభాకాంక్షలు తెలియజేశాను. పశ్చిమాసియాలో శాంతి స్థాపన అత్యవసరమని, అక్కడ సుస్థిరత ఏర్పాటు గురించీ మాట్లాడుకున్నాం. ఒమన్ సౌర్వభౌమత్వాన్ని దెబ్బతీసేలా దాడులు చేయడాన్ని భారత్ ఖండిస్తుందనే విషయాన్ని మరోమారు తెలియజేశాను. భారతీయులతో పాటు వేల మందిని సురక్షితంగా తరలించినందుకు ఒమన్ ప్రభుత్వం కృషిని అభినందించాను. హర్మూజ్ జలసంధి గుండా సురక్షితంగా, స్వేచ్ఛగా రాకపోకలు జరిగాలనే మాటకు భారత్, ఒమన్ కట్టుబడి ఉన్నాయి' అని మోదీ పేర్కొన్నారు.



# టీజీ అసెంబ్లీకి ఇద్దరు కొత్త విప్‌లు

హైదరాబాద్, మార్చి 19 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర శాసనసభలో ప్రభుత్వ కార్యకలాపాలను మరింత వేగవంతం చేసేందుకు, సభా వ్యవహారాలను సమన్వయం చేసేందుకు వీలుగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ విప్‌లుగా ముగ్గురు ఎమ్మెల్యేలను నియమిస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులను విడుదల చేసింది. విప్‌లుగా నియమితులైన వారిలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు, మహబూబ్ నగర్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఉన్నారు. శాసనసభలో ఏదైనా బిల్లుపై ఓటింగ్ జరిగినప్పుడు లేదా ముఖ్యమైన చర్చలు జరిగినప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేలందరూ హాజరయ్యేలా చూడటంలో విప్‌ల పాత్ర అత్యంత కీలకం. ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఎవరూ ఓటు వేయకుండా పార్టీ లైన్‌ను అమలు చేయడం వారి ప్రధాన బాధ్యత. బడ్జెట్ సమావేశాలు, ఇతర కీలక సెషన్ల నేపథ్యంలో ఈ నియామకాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రాజకీయంగా అనుభవం ఉన్న నాయకులకు ఈ బాధ్యతలు అప్పగించడం ద్వారా సభలో ప్రభుత్వ పట్టును మరింత బలోపేతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. తాజా నియామకాలపై సదరు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి, పార్టీ అధిష్టానానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## 99 రోజుల తర్వాత పిన్నెల్లి విడుదల

నెల్లూరు, మార్చి 19 (ఈవార్తలు): పల్నాడు రాజకీయాల్లో కీలక నేత, వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జైలు నుంచి విడుదలయ్యారు. తెలుగుదేశం పార్టీ నాయకుల జంట హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఆయనకు గురజాల కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో, గురువారం ఆయన నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా జైలు వెలుపల వైసీపీ ముఖ్య నేతలు, భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. జైలు నుంచి విడుదలైన అనంతరం పిన్నెల్లి మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనపై నమోదైన కేసులు కేవలం రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని ఆయన మండిపడ్డారు. "వెల్దుర్తి మండలంలో జరిగిన టీడీపీ వర్గాల అంతర్గత గొడవలకు, నాకు ఎలాంటి సంబంధం లేదు. ఆధిపత్య పోరులో జరిగిన హత్యల ఘటనలో నన్ను ఉద్దేశపూర్వకంగా నిందితుడిగా ఇరికించారు" అని ఆయన స్పష్టం చేశారు. నాడు జిల్లా ఎస్పీ సైతం ఈ ఘటనను ఇరువర్గాల మధ్య జరిగిన పోరుగా తేల్చినప్పటికీ, ప్రభుత్వం తనను అన్యాయంగా 99 రోజులు జైల్లో పెట్టి మానసిక క్షోభకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. "భవిష్యత్తులో మాకు తప్పకుండా ఒక రోజు వస్తుంది. ఆరోజు దీని వెనుక ఉన్న ప్రతి ఒక్కరినీ బయటకు లాగుతాం. రాజకీయ నాయకులైనా, అధికారులైనా సరే... చట్టం ముందు నిలబెట్టి తీరుతాం. ఎవరినీ వదిలిపెట్టే సమస్యే లేదు" అని ఆయన హెచ్చరించారు. పిన్నెల్లి విడుదలతో మాచర్ల, వెల్దుర్తి ప్రాంతాల్లోని వైసీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. అయితే, ఇదే కేసులో ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డికి బెయిల్ నిరాకరించడంతో ఆయన ఇంకా జైలులోనే ఉన్నారు.

## దేశానికి మోదీ ఇచ్చింది సున్నా: పొన్నం

కరీంనగర్, మార్చి 19 (ఈవార్తలు): ప్రధాని మోదీ తన 12 ఏళ్ల పాలనలో మాటల గారడీ తప్ప, దేశానికి చేసిందేమీ లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. గురువారం కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఉగాది వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రంపై ఎందుకు వివక్ష చూపిందో కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జీవన్‌రెడ్డి విషయంలో పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని, పార్టీ ఎవ్వరినీ వదులుకోవాలని అనుకోదని చెప్పారు. "అసెంబ్లీలో వందేమాతరం గేయం సమయంలో కొంతమంది ఎమ్మెల్యేలు బయటకు పోవడంపై ఒక కేంద్ర మంత్రిగా బండి సంజయ్ స్పీకర్ దృష్టికి తీసుకుపోవచ్చు. ఎవరు చేసినా అది తప్పే. అది జరిగిందా లేదా? అని చూడాలి. మూసీ ప్రాజెక్టును అప్రతిష్ఠ పాలు చేయాలని చూస్తున్నారు. గాంధీ స్మృతివనం కడతామంటే ఎన్నో విమర్శలు చేస్తున్నారు. మూసీ నిర్వాసితుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వమని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పారు. సామాజిక న్యాయం, ప్రజాసంక్షేమం కోరుకుంటూ ప్రజల ఆశీర్వాదంతో ముందుకు పోతున్నాం" అని మంత్రి పొన్నం తెలిపారు.

# సినిమాల కోసం సింగిల్ విండో

### ఆన్‌లైన్‌లోనే అన్ని అనుమతులకు ప్లాట్‌ఫాం.. గద్దర్ అవార్డుల కార్యక్రమంలో సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి 19 (ఈవార్తలు): హైదరాబాద్ అంటే ఐటీ, ఫార్మా, బిర్యానియే కాదు.. దేశస్థాయిలో సినీపరిశ్రమకు హైదరాబాద్ కేంద్రంగా రాణించాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం అన్నారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. జపాన్, కొరియా లాంటి దేశాల్లో ఫిలిం ఇండస్ట్రీ కోసం ప్రభుత్వాలు ఎంతో చేస్తున్నాయని, అదే తరహాలో మన ఇండస్ట్రీని కూడా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. తెలుగు సినీ చిత్ర పరిశ్రమలో ప్రతిష్టాత్మకమైన గద్దర్ అవార్డుల కార్యక్రమం గురువారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. చెన్నైలో ఉన్న సినీపరిశ్రమ హైదరాబాద్‌కు తరలిరావడానికి ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, రామానాయుడు, కృష్ణ.. ప్రధాన కారణం. సినీ కార్మికులు ఇల్లు కట్టుకునేందుకు ప్రభాకర్ రెడ్డి తన సొంత స్థలాన్ని దానం చేశారు. సినీపరిశ్రమలో ఏ సంక్షోభం వచ్చినా, ఏ సమస్య వచ్చినా సినీ పరిశ్రమ పెద్దగా దాసరి నారాయణరావు వాటిని పరిష్కరించి.. శాశ్వతంగా ఇండస్ట్రీని హైదరాబాద్ నగరంలో నిలిపేందుకు కృషి చేశారు. బాహుబలి, ఆర్ఆర్ఆర్,




కల్కి, పుష్ప వంటి సినిమాలు జాతీయ స్థాయిలో మన సినీ పరిశ్రమను నిలబెట్టాయి. అలాంటి ఇండస్ట్రీ కోసం ఆగిపోయిన నంది అవార్డుల స్థానంలో గతేడాది గద్దర్ పురస్కారాలను ప్రవేశపెట్టాం. వరుసగా రెండోసారి ఈ అవార్డులను అందించాం. ఈ కార్యక్రమానికి ఖుష్బూ, జయసుధ వంటి వారు రావడం సంతోషం. నాగచైతన్య, రష్మిక అందరూ యంగ్‌స్టర్స్. వీళ్లకు అవార్డులు ఇచ్చేందుకు వచ్చిన సీనియర్స్ అందరినీ అభినందిస్తున్నాను. హైదరాబాద్‌లో.. అంతర్జాతీయ స్థాయిలో సినిమాలు తీసేవారికి అన్నిరకాల అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని తీసుకొస్తుంది. ఆన్‌లైన్‌లోనే అన్ని అనుమతులు ఇచ్చేలా ఒక ప్లాట్‌ఫామ్ క్రియేట్ చేయాలని డిప్యూటీ సీఎంని కోరుతున్నాను. ఇకపోతే గద్దర్ ఒక ప్రజాయుద్ధ నౌక.. ఆయన పేరు కోట్లాదిమందిని ప్రభావితం చేసి సామాజిక రుగ్మతల మీద యుద్ధం చేయడానికి ప్రోత్సహించింది. ఆయన గళం తెలియనివారు దేశంలో లేరు. గద్దర్ ఒక చైతన్యం, స్ఫూర్తి. అందుకే ఈ అవార్డులకు ఆయన పేరు పెట్టాం. సినిమా అనేది అత్యంత శక్తివంతమైన ఆయుధం. సామాజిక బాధ్యతను గుర్తెరిగి, సమాజంలోని సమస్యలపై పోరాడేందుకు సినిమా ఇండస్ట్రీ తోడ్పడాలి అని రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి హాజరై విజేతలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ వేడుకలో సినీ ప్రముఖులు చిరంజీవి, కమల్ హాసన్, నాగార్జున, రాంచరణ్, ఖుష్బూ, నాగచైతన్య, అల్లు అరవింద్, దిల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## రామయ్య తిరు కల్యాణానికి సీఎంకు ఆహ్వానం

హైదరాబాద్, మార్చి 19 (ఈవార్తలు): భద్రాచలంలో ఈ నెల 19 నుంచి ఏప్రిల్ 2 వరకు శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నెల 27న శ్రీ సీతారామచంద్రస్వామి వారి తిరుకల్యాణ మహోత్సవం జరగనుంది. రామయ్య కల్యాణోత్సవాలకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, ఈవో దామోదర్‌రావు, ఆలయ అర్చకులు సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఉన్నారు.



# వందేమాతరం పాడాల్సిందే

**ఎంఐఎంపై బండి సంజయ్ ఫైర్**

కరీంనగర్, మార్చి 19 (ఈవార్తలు): అసెంబ్లీలో వందేమాతరం ఆలపించే సమయంలో ఎంఐఎం ఎమ్మెల్యేలు బయటకు వెళ్లడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ దేశంలో ఉండేవారు ఎవరైనా జాతీయ గీతాన్ని గౌరవించి, వందేమాతరం పాడాల్సిందేనని స్పష్టం చేశారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీజేపీ అధికారంలోకి వస్తే వందేమాతరం గానాన్ని తప్పనిసరి చేస్తుందని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఐఎం నేతల తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన 'తొక్కుకుంట వచ్చిన' వ్యాఖ్యల వెనుక అంతర్గత రాజకీయాలు ఉన్నాయని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ సీనియర్ నేత రహస్యంగా మరో పార్టీతో



సమావేశమైనందునే సీఎం ఈ వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా, కేరళ ఎన్నికల ఖర్చుల కోసం తెలంగాణ నుంచి నిధులు తరలిస్తున్నారని, ఈ బాధ్యతను రాహుల్ గాంధీ స్వయంగా సీఎం రేవంత్ రెడ్డికి అప్పగించారని సంచలన ఆరోపణలు చేశారు. రైతు సంక్షేమం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని బండి సంజయ్ విమర్శించారు. ఎన్నికల హామీ ప్రకారం కౌలు రైతులకు, రైతు కూలీలకు ఆర్థిక సాయం ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. ఈ నెల 22న ఇస్తామన్న రైతు భరోసాతో పాటు పెండింగ్‌లో ఉన్న ఐదు విడతల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మూసీ నది ప్రక్షాళనపై మాట్లాడుతూ, గుజరాత్‌లోని సబర్మతి నది తరహాలో అభివృద్ధి చేయడాన్ని స్వాగతిస్తామని, అయితే పేదల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. బాధితులకు సరైన నష్టపరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలని సూచించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో స్పీకర్ తీసుకుంటున్న నిర్ణయాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, శాసనసభ, స్పీకర్ వ్యవస్థపై నమ్మకం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఐఎం ఓటు బ్యాంకు రాజకీయాలకు సీఎం, స్పీకర్ తలొగ్గుతున్నారని విమర్శించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎంఐఎం అరాచకాలను ఎండగడతామని చెబుతూ, అసదుద్దీన్ ఓవైసీ నడిపే విద్యాసంస్థల్లో ఉగ్రవాద మూలాలు ఉన్నాయని తీవ్ర ఆరోపణలు చేశారు. అనంతరం హిందూ బంధువులందరికీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

## కొత్తగూడెంలో 52 లక్షల గంజాయి పట్టివేత

కొత్తగూడెం, మార్చి 19 (ఈవార్తలు): తెలంగాణ పోలీసులు రూ.52 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలురుపాడు మండల కేంద్రంలో పోలీసులు భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాకు చెందిన పలువురిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వాహనాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో సుమారు 105.54 కిలోల గంజాయిని కార్లలో గుర్తించారు. వాహనంలో గంజాయి తరలిస్తున్నరనే పక్కా సమాచారంతో జూలూరుపాడు పోలీసులు, సీసీఎస్ సిబ్బంది సంయుక్తంగా జరిపిన తనిఖీల్లో రెండు కార్లలో గంజాయి పట్టుబడింది. టీఎస్11 ఈఆర్ 6312, టీఎస్07 జేవై 3959 అనే నెంబర్లతో కూడిన రెండు కార్లను పోలీసులు ఆపారు. ఆ కార్లలో సోదాలు చేయగా దాచి ఉంచిన 52 గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. కార్లలో గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని విచారించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కలిమెల, డొంకరాయి ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్లు వారు పోలీసులకు తెలిపారు. ఈ గంజాయిని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం మీదుగా హైదరాబాద్‌కు తరలించి విక్రయించాలని ప్రయత్నించినట్లు తెలిపారు. అరెస్టైన ముగ్గురిని నల్గొండ జిల్లాకు చెందిన శివాకర్ ప్రమోద్ కుమార్ (35), బైరెడ్డి భార్గవ్ (30), రంగారెడ్డి జిల్లా వనస్థలిపురంకు చెందిన అందేకర్ శ్రీనివాస్ (40)లుగా గుర్తించారు. వీరిని అరెస్టు చేసిన పోలీసులు రెండు కార్లు, నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అభి, లక్ష్మణ్, ఫరూక్ అనే ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు.

## దేశద్రోహులకు పరాభవమే!

**ఉగాది సందర్భంగా కిషన్ రెడ్డి వ్యాఖ్యలు**

హైదరాబాద్, మార్చి 19 (ఈవార్తలు): హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఉగాది శోభతో కళకళలాడింది. 'శ్రీ పరాభవ నామ సంవత్సర' ఉగాది వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలుగు ప్రజలందరికీ నూతన తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పండితులు వినిపించిన పంచాంగ శ్రవణం అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొత్త ఏడాది పేరు 'పరాభవ' అని ఉండటంపై కిషన్‌రెడ్డి ఒక విభిన్నమైన విశ్లేషణ ఇచ్చారు. "పరాభవం అనే పదం మన దేశానికి కానీ, ధర్మాన్ని నమ్మే మన ప్రజలకు కానీ వర్తించదు. ఈ పరాభవం కేవలం భారతదేశ ఎదుగుదలను ఓర్వలేని శత్రువులకు, దేశద్రోహులకు మాత్రమే ఎదురవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. పుణ్యభూమి అయిన భారతావనిలో ఈ ఏడాది శుభ ఫలితాలే రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. పండితులు వివరించిన పంచాంగం ప్రకారం... ఈ ఏడాది దేశ భవిష్యత్తు ఎంతో ఆశాజనకంగా ఉందని కిషన్‌రెడ్డి తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండుతాయని, రైతులు సుఖసంతోషాలతో ఉంటారని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలతో సతమతమవుతున్నా, ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ మాత్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని గుర్తు చేశారు. ఉగాది పచ్చడిలోని షడ్రుచులు మన జీవితానికి ప్రతీక అని, తీపి-వగరు-చేదు అన్నీ కలిస్తేనే జీవితమని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా, 140 కోట్ల మంది భారతీయులు ఐక్యంగా నిలబడితే ఏ సమస్యనైనా అధిగమించవచ్చని అన్నారు.

## వాట్సాప్‌లో 'గ్యాస్ బుకింగ్' మోసాలు

న్యూఢిల్లీ: ఎల్పీజీ గ్యాస్ బుకింగ్స్ పేరుతో కొత్త తరహా సైబర్ మోసాలు వెలుగులోకి వచ్చాయి. 'గ్యాస్ బిల్ అప్‌డేట్.ఏపీకే' వంటి హానికరమైన ఫైల్స్‌ను వాట్సాప్ ద్వారా పంపి వినియోగదారులను మోసం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని కేంద్ర ప్రభుత్వం గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించింది. ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇలాంటి అనుమానాస్పద ఫైల్స్‌ను, అప్లికేషన్లను ఎట్టిపరిస్థితుల్లోనూ డౌన్‌లోడ్ లేదా ఇన్‌స్టాల్ చేయవద్దని అధికారులు తెలిపారు. వీటి ద్వారా సైబర్ నేరగాళ్లు వినియోగదారుల వ్యక్తిగత డేటా, బ్యాంకు ఖాతాల వివరాలను దొంగిలించే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. గ్యాస్ బుకింగ్స్ కోసం కేవలం అధికారిక ప్లాట్‌ఫామ్స్‌ను మాత్రమే ఉపయోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు, దేశవ్యాప్తంగా ఎల్పీజీ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూసేందుకు అవసరమైన ఏర్పాట్లను మరింత పటిష్టం చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం సూచించింది. గ్యాస్ కొరతపై వదంతులు నమ్మవద్దని, ఆందోళనతో సిలిండర్లు బుక్ చేసుకోవద్దని కోరింది. గ్యాస్ సరఫరాను నిరంతరాయంగా కొనసాగించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకసారి బుకింగ్ చేసుకునేలా విరామాన్ని సవరించారు. గ్యాస్‌పై ఒత్తిడి తగ్గించేందుకు కిరోసిన్, బొగ్గు వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది. అలాగే, కొత్త పీఎన్ జీ కనెక్షన్లను ప్రోత్సహించాలని రాష్ట్రాలకు సూచించింది. మొత్తం మీద గ్యాస్ సరఫరాకు ఢోకా లేదని భరోసా ఇస్తూనే, సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వం ప్రజలను కోరుతోంది.

# 22 నుంచి భరోసా వేస్తాం

**సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన**

హైదరాబాద్, మార్చి 19 (ఈవార్తలు): తెలంగాణ రైతులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. మార్చి 22వ తేదీన 'రైతు భరోసా' పథకం కింద నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రకటించారు. నేడు హైదరాబాద్‌లో జరిగిన 'శ్రీ పరాభవ నామ ఉగాది' వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ కొత్త తెలుగు సంవత్సరాన్ని రైతుల సంక్షేమానికి అంకితం చేస్తున్నామని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును 'రాజు'గా నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ కూడా అందిస్తున్నామని గుర్తుచేశారు. ఇప్పటికే రైతు భరోసా కింద రూ.18,000 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. రుణభారంతో ఉన్న రైతులకు పెద్ద ఊరటనిస్తూ రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేశామని తెలిపారు. దేశంలోనే అత్యంత తక్కువ రుణభారం ఉన్న రైతులు తెలంగాణలోనే ఉన్నారని చెప్పడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్రంలోని 70 శాతం కుటుంబాలు వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ధరణి పోర్టల్‌తో రైతులకు ఎదురైన భూ యాజమాన్య సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు దాని స్థానంలో 'భూ భారతి'ని తీసుకొచ్చామని రేవంత్ రెడ్డి వివరించారు. దేశంలోనే తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పునరుద్ఘాటించారు. ఈ ఉగాది పర్వదినం సందర్భంగా, ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు.

## నేడు, రేపు వర్షాలు

హైదరాబాద్, మార్చి 19 (ఈవార్తలు): రాష్ట్రంలో శుక్ర, శనివారాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కి.మీలతో కూడిన ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గురువారం ఖమ్మం జిల్లా వైరాలో 4 సెం.మీ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్‌లో 4 సెం.మీ, జోగులాంబ గద్వాల జిల్లా ఐజలో 2 సెం.మీ, ఖమ్మం జిల్లా మధిరలో 1 సెం.మీ చొప్పున వర్షం కురిసింది. రాగల మూడు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల మేర పెరగనున్నట్లు ఐఎండీ హెచ్చరించింది.




## ఇద్దరికి 'చంద్రమోహన్' విద్యారత్న పురస్కారాలు

హైదరాబాద్, మార్చి 19 (ఈవార్తలు): వసుంధర విజ్ఞాన వికాస మండలి 33వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన చంద్ర మోహన్ స్మారక విద్యారత్న పురస్కారాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఇద్దరికీ పురస్కారం ప్రకటిస్తూ వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్ నిర్ణయించింది. ఏపీలోని కోనసీమ జిల్లాకు చెందిన కొప్పిశెట్టి కృష్ణా సాయి, తెలంగాణలోని సిద్దిపేట జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు నిర్మలను ఎంపిక చేయినట్లు వెల్లడించింది. ఈ నెల 26న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే వసుంధర విజ్ఞాన వికాస మండలి 33వ వార్షికోత్సవం సందర్భంగా పురస్కారం అందజేయనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మధుకర్ వైద్యుల తెలిపారు.







## ఐదుగురికి 'కర్క ముత్తారెడ్డి' పురస్కారాలు

హైదరాబాద్, మార్చి 19 (ఈవార్తలు): వసుంధర విజ్ఞాన వికాస మండలి 33వ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కర్క ముత్తారెడ్డి స్మారక కవితా పురస్కారాల కోసం నిర్వహించిన జాతీయ కవితా పోటీల్లో 5 ఉత్తమ కవితలను నిర్వాహకులు ఎంపిక చేశారు. మొత్తం 68 కవితలు రాగా, వాటిలో ఉత్తమ కవితలను ఎంపిక చేసి రూ.1000 నగదు, మెమెంటో, సర్టిఫికెట్, శాలువా అందజేయనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మధుకర్ వైద్యుల తెలిపారు. విజేతల్లో పొత్తూరి సీతారామ రాజు (కాకినాడ), కళా గోపాల్ (నిజామాబాద్), ఎన్ లహరి (హైదరాబాద్), జేడీ వరలక్ష్మి(తూర్పు గోదావరి జిల్లా), సోమిశెట్టి వేణుగోపాల్ (కరీంనగర్) ఉన్నారని వెల్లడించారు. వీరికి ఈ నెల 26న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పురస్కారం అందజేస్తామని పేర్కొన్నారు



## ఒంటి పూట బడులేవి?

**ఎండ తీవ్రతతో విద్యార్థులకు ఇబ్బందులు**

**అయినా పట్టించుకోని ప్రైవేట్ పాఠశాలలు**

**మొద్దు నిద్రలో ప్రభుత్వ విద్యాధికారులు**

మల్యాల, మార్చి 19 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో ఎండల తీవ్రత రోజురోజుకీ పెరుగుతున్నప్పటికీ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒంటిపూట బడి విధానాన్ని పలు ప్రైవేటు పాఠశాలలు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఆదేశాలను పక్కనబెట్టి తమ ఇష్టారీతిన రెండు పూటల పాఠశాలలను నిర్వహిస్తూ విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వేసవి వేడి తట్టుకోలేక విద్యార్థులు అలసటకు గురవుతూ ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులకు ఏవైనా అనర్థాలు జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారు? అనే ప్రశ్న తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇకపోతే, ఈ విషయంపై మండల విద్యాధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, ఒంటి పూట బడులను కచ్చితంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## ఘనంగా గొల్ల మారమ్మ కుంభం

కాకినాడ, మార్చి 19 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ జిల్లా యూ.కొత్తపల్లి మండలం శ్రీరాంపురం గ్రామంలో గొల్ల మారమ్మ అమ్మవారి కుంభం కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామంలో వివిధ వీధుల నుంచి మహిళలు, యువతలు సంప్రదాయ బట్టలు ధరించి, తలపై కుంభాలు మోసుకుంటూ భక్తి శ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా డబ్బులు కోలాటాలు, భజనలు మధ్య అమ్మవారి నామస్మరణతో, గ్రామం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి కుంభం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు ఆలయ కమిటీ సభ్యులు, పోలీసులు భద్రత ఏర్పాట్లు చేపట్టి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు.

## ఇరాన్‌తో యుద్ధం.. 18 లక్షల కోట్లు కావాలి

**అమెరికా పార్లమెంటుకు పెంటగాన్ ప్రతిపాదన**

పెంటగాన్: ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో అమెరికాకు భారీ మొత్తంలో ఖర్చు అవుతోంది. ఇరాన్‌తో రానున్న రోజుల్లో భీకర యుద్ధం కొనసాగించేందుకు 200 బిలియన్ డాలర్లకు పైగా నిధులు ఇవ్వాలని అమెరికా పార్లమెంటుకు ప్రతిపాదన చేశామని, దీనికి ఆమోదం తెలపాలని పెంటగాన్ కోరినట్లు తెలుస్తోంది. మన కరెన్సీలో ఇది సుమారు రూ.18 లక్షల కోట్లకు పైగా ఉంటుంది. ఈ మేరకు వాషింగ్టన్ పోస్టు కథనాన్ని ప్రచురించింది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం 20వ రోజుకు చేరింది. దీనిపై ఇరాన్ స్పందించింది. ఇజ్రాయెల్ అజెండాను అమలు చేయడానికి అమెరికా సొంత పౌరులపై భారం మోపుతోందని ఆరోపించింది. ఈ యుద్ధం మొదలై మూడు వారాలే అయిందని పేర్కొంది. ఇజ్రాయెల్ అజెండా కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నారని విమర్శించింది. ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుందని హెచ్చరించింది. యుద్ధం భారం సామాన్య అమెరికన్లపై పడుతోందని పేర్కొంది.

## ఖతార్ గ్యాస్.. మరమ్మతులకు ఐదేళ్లు!

దోహా: ఇరాన్ దాడుల కారణంగా ఖతార్‌కు భారీ నష్టం సంభవించింది. ఖతార్ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఇంధన ఉత్పత్తి క్షేత్రాలపై ఇరాన్ దాడులు చేయడం వల్ల, లిక్విఫైడ్ నేచరల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) ఎగుమతుల్లో 17 శాతం వరకు ఉత్పత్తి చేసే కేంద్రాలు దెబ్బతిన్నాయని ఖతార్ ఎనర్జీ సీఈవో సాద్ అల్కాబీ వెల్లడించారు. ఈ దాడి వల్ల 20 బిలియన్ డాలర్ల మేర నష్టం జరిగిందని, ఈ కేంద్రాల మరమ్మతుకు 5 ఏళ్లు పడుతుందని తెలిపారు. ఖతార్ ఇంధన ఉత్పత్తి మౌలిక సదుపాయాలపై జరిగిన దాడుల కారణంగా రాస్ లఫాన్ కేంద్రంలోని రెండు ఎల్ఎన్‌జీ ఉత్పత్తి కేంద్రాలు, ఒక గ్యాస్ టు లిక్విడ్స్ కేంద్రం దెబ్బతిన్నదని పేర్కొన్నారు. ఈ దాడి వల్ల 12.8 మిలియన్ టన్నుల చమురు ఉత్పత్తి నాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. యూరప్, ఆసియాకు ఎల్ఎన్‌జీ సరఫరాలో ఇబ్బందులు ఏర్పడతాయని అన్నారు. ఖతార్‌లో ఇలాంటి దాడులు జరుగుతాయని అసలు ఊహించలేదని, ఖతార్ ఎనర్జీ సీఈవో అన్నారు. రంజాన్ మాసంలో తమ సోదర దేశం ఇలా చేస్తుందని అనుకోలేదని వాపోయారు. ఎల్ఎన్‌జీలకు సంబంధించి ఇటలీ, బెల్జియం, దక్షిణ కొరియా, చైనాలతో కుదుర్చుకున్న ఒప్పందాలపై ప్రభావం పడుతుందని అన్నారు. దెబ్బతిన్న కేంద్రాల నిర్మాణానికి 26 బిలియన్ డాలర్ల ఖర్చు అవుతుందని వెల్లడించారు. ఐదేళ్ల పాటు 17 శాతం ఉత్పత్తి సామర్థ్యం దెబ్బతిన్నట్లే అన్నారు.

# పాక్ దొంగ బుద్ధి సౌదీకి అర్థమైందా?



రియాద్: పశ్చిమాసియాలో రాజుకుంటున్న సంక్షోభం, సౌదీ అరేబియా-పాకిస్తాన్ మధ్య ఉన్న వ్యూహాత్మక సైనిక రక్షణ ఒప్పందం (ఎస్ఎండీఏ) బలాన్ని, విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తోంది. ఒకప్పుడు అత్యంత దృఢమైనదిగా ప్రచారం పొందిన ఈ బంధంలో తాజా పరిణామాలు తీవ్రమైన బీటలను బహిర్గతం చేశాయి. ఇరాన్, సౌదీ అరేబియా, పాకిస్తాన్ చుట్టూ అల్లుకున్న ఈ వ్యవహారం, ఇస్లామాబాద్ విశ్వసనీయతపై అంతర్జాతీయంగా చర్చకు దారితీసింది. దక్షిణాఫ్రికాకు చెందిన 'ద స్టార్' మీడియా సంస్థ తన కథనంలో ఈ అంశాన్ని విశ్లేషించింది. దాని ప్రకారం, ఈ ఒప్పందం కుదిరినప్పుడు ఇరు దేశాలు గొప్పగా ప్రచారం చేసుకున్నాయి. బయటి శక్తుల నుంచి ముప్పు వాటిల్లితే ఒకరికొకరు అండగా నిలవాలన్నది దీని ప్రధాన ఉద్దేశం. ఒకరిపై దాడి జరిగితే, అది ఇద్దరిపై జరిగినట్టుగా భావించి సంయుక్తంగా ప్రతిస్పందించే 'నాటో' తరహా కూటమిగా విశ్లేషకులు దీనిని అభివర్ణించారు. సంపన్న గల్ఫ్ దేశానికి, దక్షిణాసియా భాగస్వామి అయిన పాకిస్థాన్ భద్రతాపరంగా అండగా నిలుస్తుందనే భరోసా ఈ ఒప్పందం కల్పించింది. అయితే, 2026 ఫిబ్రవరి 28న పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. ఇరాన్‌లోని సైనిక, రాజకీయ మౌలిక సదుపాయాలపై అమెరికా, ఇజ్రాయెల్ సమన్వయంతో దాడులు చేశాయి. దీనికి ప్రతీకారంగా ఇరాన్.. సౌదీ అరేబియాతో సహా పలు గల్ఫ్ దేశాలపై దాడులకు దిగింది. ఒప్పందం ప్రకారం, ఈ క్లిష్ట సమయంలో పాకిస్థాన్ సైనికపరంగా సౌదీకి మద్దతుగా నిలవాలి. కానీ, పాకిస్థాన్ నుంచి ఎలాంటి సైనిక సహాయం అందలేదు. దీంతో నమ్మకమైన భాగస్వామిగా పాక్ పాత్రపై సందేహాలు మొదలయ్యాయి. సౌదీ అరేబియాకు మద్దతు ప్రకటించాల్సింది పోయి, పాకిస్థాన్ తన సొంత సమస్య అయిన ఆఫ్ఘనిస్థాన్‌తో సరిహద్దు ఘర్షణపైనే పూర్తి దృష్టి సారించింది. ఈ ఉద్రిక్తతలను సాకుగా చూపి, సౌదీతో ఉన్న ఒప్పంద బాధ్యతల నుంచి తెలివిగా తప్పుకుంది. పాకిస్థాన్ తీసుకున్న ఈ వ్యూహాత్మక నిగ్రహం వెనుక దేశీయ రాజకీయ ఒత్తిళ్లు, అంతర్జాతీయ సైనిక భాగస్వామ్యాలపై దాని పునరాలోచన ధోరణి స్పష్టంగా కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. సంవత్సరాలుగా సౌదీ భద్రతకు తాము ఒక వ్యూహాత్మక అండగా ఉంటామని చెబుతూ వచ్చిన పాకిస్థాన్, తీరా అవసరం వచ్చినప్పుడు మాట తప్పడం గమనార్హం. ఇది సౌదీ అరేబియాకు తీవ్ర నిరాశ కలిగించే అంశం. ఈ ఒప్పందంపై సౌదీ దౌత్యపరంగా, వ్యూహాత్మకంగా ఎంతో పెట్టుబడి పెట్టింది. ప్రాంతీయ ముప్పులను ఎదుర్కోవడంలో పాక్ విశ్వసనీయతకు ఇదే నిదర్శనమని సౌదీ అధికారులు పదేపదే చెబుతూ వచ్చారు. కానీ ప్రస్తుత సంక్షోభం, పాక్ మద్దతు కేవలం మాటలకే పరిమితమని, చేతల్లో శూన్యమని తేల్చి చెప్పింది. పాకిస్థాన్ వైఖరి వల్ల సౌదీ తన రక్షణ భాగస్వామ్యాలపై పునరాలోచనలో పడింది. పాక్ నుంచి ఏర్పడిన లోటును భర్తీ చేసుకునేందుకు పశ్చిమ దేశాలతో సహా ఇతర భాగస్వాములతో సంబంధాలను బలోపేతం చేసుకునే అవకాశాలున్నాయి. మరోవైపు, ఈ పరిణామం పాకిస్థాన్ దౌత్య పరపతిని కూడా దెబ్బతీస్తుంది. భవిష్యత్తులో ఏదైనా సంక్షోభం వస్తే పాకిస్థాన్‌ను నమ్మవచ్చా లేదా అని ఇతర దేశాలు ప్రశ్నించే పరిస్థితి తలెత్తింది. ఇది ప్రాంతీయంగా దాని వ్యూహాత్మక పలుకుబడిని గణనీయంగా తగ్గిస్తుందని 'ద స్టార్' తన కథనంలో అభిప్రాయపడింది.

# విదేశీ వైద్యులకు హెచ్-1బీ ఫీజు వద్దు

**మినహాయింపు కోరుతూ అమెరికాలో కీలక బిల్లు**




న్యూయార్క్: అమెరికాలో వైద్యులు, ఆరోగ్య సంరక్షణ సిబ్బందికి ఊరట కల్పించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. హెచ్-1బీ వీసాల కోసం ప్రతిపాదించిన లక్ష డాలర్ల భారీ ఫీజు నుంచి వైద్య రంగానికి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ కొందరు చట్టసభ సభ్యులు అమెరికా కాంగ్రెస్‌లో ఓ బిల్లును ప్రవేశపెట్టారు. రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీలకు చెందిన సభ్యులు కలిసికట్టుగా ఈ బిల్లును తీసుకురావడం గమనార్హం. ఈ భారీ ఫీజు వల్ల దేశంలో ఇప్పటికే తీవ్రంగా ఉన్న వైద్యుల కొరత మరింత పెరిగిపోతుందని, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. "హెచ్-1బీస్ ఫర్ ఫిజిషియన్స్ అండ్ ది హెల్త్‌కేర్ వర్క్‌ఫోర్స్ యాక్ట్" పేరుతో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని ఆసుపత్రులు విదేశీ వైద్యులపైనే ఎక్కువగా ఆధారపడతాయని, లక్ష డాలర్ల ఫీజు వారికి పెను భారంగా మారుతుందని కాంగ్రెస్ సభ్యురాలు మరియా ఎల్విరా సలాజర్ అన్నారు. "వైద్యుల కొరత పెరుగుతున్న తరుణంలో ఇలాంటి ఫీజులు ప్రతిభావంతులైన వైద్యులను నియమించుకోవడానికి ఆసుపత్రులకు అడ్డంకిగా మారకూడదు" అని ఆమె స్పష్టం చేశారు. అధ్యక్షుడి ప్రకటన ద్వారా అమల్లోకి వచ్చిన ఈ ఫీజు ప్రతిపాదన, ఆరోగ్య సంరక్షణ సంస్థలను హెచ్-1బీ కార్యక్రమానికి దూరం చేస్తుందని మరో కాంగ్రెస్ సభ్యుడు మైక్ లాలర్ హెచ్చరించారు. "ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఇప్పటికే సిబ్బంది కొరతతో సతమతమవుతున్నాయి. కొత్తగా వచ్చే వలస ఉద్యోగిపై లక్ష డాలర్ల ఫీజు చెల్లించే స్థితిలో అవి లేవు. ఈ మినహాయింపు ఇవ్వకపోతే వైద్యులు హెచ్-1బీ కార్యక్రమానికి దూరమై, ప్రజలకు వైద్య సేవలు అందడం కష్టమవుతుంది" అని ఆయన వివరించారు. చట్టసభ సభ్యుల సమాచారం ప్రకారం, ప్రస్తుతం అమెరికాలో దాదాపు 8.7 కోట్ల మంది ప్రజలు సరైన వైద్య సదుపాయాలు లేని ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ఆసుపత్రులకు ఈ ఫీజు మోయలేని భారంగా మారుతుందని కాంగ్రెస్ సభ్యుడు శాన్‌ఫోర్డ్ బిషప్ అన్నారు.

## ప్రపంచానికి పరీక్ష సమయమిది: కేంద్రం

న్యూఢిల్లీ: ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా పశ్చిమాసియా పరిణామాలు మన దేశానికే కాకుండా ప్రపంచానికే పరీక్షగా మారాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. దేశ ఇంధన అవసరాలు తీరేలా చూసుకోవడానికి సంబంధిత దేశాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. ఈ మేరకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మీడియాతో మాట్లాడుతూ, పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని అన్నారు. కువైట్ యువరాజుతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారని జైశ్వాల్ తెలిపారు. ఆయా దేశాలు, భాగస్వామ్య పక్షాలతో దౌత్యపరంగా చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. చిన్న, మధ్య తరహా, ఇతర వినియోగదారులకు పంపిణీ చేసేందుకు గాను రాష్ట్రాలకు అధిక పరిమాణంలో శాఖ ఇప్పటికే కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు కేంద్ర అధికారులు వెల్లడించారు.

# 11 రోజులకే ముడి చమురు నిల్వలు

**తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న పాకిస్థాన్**



ఇస్లామాబాద్: పాకిస్థాన్ తీవ్ర ఇంధన సంక్షోభంలో చిక్కుకుంది. దేశంలో కేవలం 11 రోజులకు సరిపడా ముడిచమురు నిల్వలు మాత్రమే ఉండటం ఇంధన భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు సరఫరా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఓ నివేదిక వెల్లడించింది. పెట్రోలియంపై ఏర్పాటైన సెనేట్ స్టాండింగ్ కమిటీకి అధికారులు ఈ వివరాలు అందించారు. దేశంలో ప్రస్తుతం 21 రోజులకు సరిపడా డీజిల్, 27 రోజులకు పెట్రోల్, 9 రోజులకు ఎల్పీజీ, 14 రోజులకు విమాన ఇంధనం నిల్వలు ఉన్నాయని పెట్రోలియం కార్యదర్శి తెలిపారు. పాకిస్థాన్ తన పెట్రోలియం అవసరాల్లో దాదాపు 70 శాతం మధ్యప్రాచ్యం నుంచే దిగుమతి చేసుకుంటోంది. తాజా ఘర్షణల కారణంగా కీలకమైన నౌకా మార్గాలు దెబ్బతిన్నాయి. ఎర్ర సముద్రం మీదుగా సరుకు రవాణాకు గతంలో 4-5 రోజులు పట్టగా, ఇప్పుడు 12 రోజులు పడుతోంది. మరోవైపు పాకిస్థాన్‌లో గ్యాస్ సంక్షోభం కూడా పొంచి ఉంది. ఏప్రిల్ 14 తర్వాత దేశంలో తీవ్రమైన ద్రవీకృత సహజ వాయువు కొరత ఏర్పడుతుందని అధికారులు హెచ్చరించారు. మార్చిలో రావాల్సిన ఎనిమిది ఎల్ఎన్‌జీ కార్గోలలో కేవలం రెండే పాకిస్థాన్‌కు చేరాయి. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు పాక్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హర్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణాకు అనుమతి కోసం ఇరాన్‌తో చర్చలు జరుపుతోంది. పరిస్థితిని సమీక్షించేందుకు ప్రభుత్వం ప్రతిరోజూ ఇంధన నిల్వలపై సమీక్ష నిర్వహిస్తోంది. ప్రస్తుతానికి మార్చి నెలకు సరిపడా నిల్వలు ఉన్నాయని, ఏప్రిల్ మధ్య వరకు సరఫరాకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు.

**పాక్ రిపబ్లిక్ డే వేడుకలు రద్దు**


ఆర్థిక సంక్షోభం కోరల్లో చిక్కుకున్న పాకిస్థాన్, తన 'రిపబ్లిక్ డే' (మార్చి 23) వేడుకలపై కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో నెలకొన్న విపత్కర పరిస్థితుల దృష్ట్యా ఈ ఏడాది అధికారిక వేడుకలను రద్దు చేస్తున్నట్లు ప్రధాని షెహబాజ్ షరీఫ్ కార్యాలయం ప్రకటించింది. ఆడంబరాలకు పోకుండా కేవలం జెండా ఆవిష్కరణకే ఈ వేడుకలను పరిమితం చేయాలని నిర్ణయించారు. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ప్రపంచవ్యాప్తంగా ఆకాశాన్నంటుతున్న చమురు ధరల నేపథ్యంలో పాక్ ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. సాధారణంగా అట్టహాసంగా జరిగే సైనిక కవాతు, 31-గన్ సెల్యూట్, భారీ సాంస్కృతిక ప్రదర్శనలను ఈసారి పూర్తిగా నిలిపివేశారు. ప్రభుత్వ శాఖలన్నీ నిరాడంబరంగా వ్యవహరించాలని, అనవసర ఖర్చులకు తావు లేకుండా గౌరవప్రదంగా ఈ సందర్భాన్ని పాటించాలని ప్రధాని ఆదేశించారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల కారణంగా అంతర్జాతీయంగా ఇంధన సరఫరా వ్యవస్థ దెబ్బతిన్న సంగతి తెలిసిందే. దీనివల్ల పాకిస్థాన్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశం తీవ్ర ఆర్థిక అస్థిరతను ఎదుర్కొంటోంది. ఈ విపత్తును తట్టుకోవడానికి మార్చి నెలలో ప్రభుత్వం ప్రకటించిన 'పొదుపు చర్యల'లో భాగంగానే ఈ రద్దు నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి.

## భారత్‌కు అమెరికా గ్యాస్

**కొనుగోలుకు కేంద్రం యోచన**

న్యూఢిల్లీ: ఎల్పీజీ సిలిండర్ల కొరత ఏర్పడుతుందన్న ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. మధ్యప్రాచ్యంలో నెలకొన్న సంక్షోభం కారణంగా సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నప్పటికీ, అమెరికా వంటి దేశాల నుంచి ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ)ను కొనుగోలు చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. దేశంలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చింది. గురువారం నాడు పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ మాట్లాడుతూ, "యుద్ధ పరిస్థితుల కారణంగా ఆందోళన ఉన్నప్పటికీ, ఏ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ వద్ద కూడా గ్యాస్ కొరత లేదు. సిలిండర్ల డెలివరీ సాధారణంగానే కొనసాగుతోంది" అని తెలిపారు. ప్రజల్లో భయాందోళనలు తగ్గి ప్యానిక్ బుకింగ్ కూడా తగ్గిందని, బుధవారం ఒక్కరోజే దాదాపు 57 లక్షల రీఫిల్ బుకింగ్‌లు వచ్చాయని ఆమె వివరించారు. దేశంలో ముడిచమురు పరిస్థితి, రిఫైనరీ కార్యకలాపాలు కూడా సాధారణంగానే ఉన్నాయని చెప్పారు. మధ్యప్రాచ్యంలో పరిణామాలు భారత్‌పై ప్రభావం చూపుతాయని, అందుకే హార్మూజ్ జలసంధిలో ఆంక్షల నేపథ్యంలో భారత్ ఇప్పటికే గల్ఫ్ దేశాలపై ఆధారపడటం తగ్గించుకుందని సుజాత శర్మ తెలిపారు. ప్రస్తుతం 70 శాతం ముడి చమురును అమెరికా, రష్యా, నైజీరియా వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు ఆమె గుర్తుచేశారు. అదే సమయంలో, బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలను ఆదేశించినట్లు ఆమె వెల్లడించారు. దేశవ్యాప్తంగా 6,000 దాడులు నిర్వహించగా, ఉత్తరప్రదేశ్‌లో 1,000, మధ్యప్రదేశ్‌లో 2,300 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇదిలావుండగా, పశ్చిమాసియా జలాల్లో భారత నౌకలు, నావికులు సురక్షితంగా ఉన్నారని షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా తెలిపారు.






**అన్ని ప్రేమకథా చిత్రాల్లో ఊహించినట్లే , అనేక సంబంధాలు, అనేక మలుపులు ఉన్నప్పటికీ ఈ కథలో కూడా ముగింపు విజయవంతంగా ఉంది. కథానాయకుడు, కథానాయిక ఒకరినొకరు ముద్దు పెట్టుకుని, ఒక్కటై, పెళ్లి చేసుకుని, ఒక బిడ్డను కంటారు. ఐతే ఈ పుస్తకంలో కొన్ని అసంగతమైన విషయాలు కనిపిస్తాయి. సాకేత్ తో తన మొదటి గర్ల్ ఫ్రెండ్ తానియా ఒత్తిడి మేరకు పాలినాని తన రెండవ ప్రియురాలిగా చేసుకోవడానికి సాకేత్ కూడా ఆసక్తి చూపడం ద్వారా ఈ పుస్తకంలో అతని పాత్రను కూడా కొంత అనైతికంగా చూపారు. పాలీనాది కూడా ఎంత నీచమైన ప్రవర్తన!**

# 12 ఏండ్ల గందరగోళ ప్రేమ కథ

( చేతన్ భగత్ రచించిన '12 ఇయర్స్ మై మెస్డ్ అప్ లవ్ స్టోరీ' పై సమీక్ష)

**విభిన్నమైన విషయాలు కూడా ఈ పుస్తకం లో అగుపిస్తాయి. పాలినా సాకేత్ కంటే పొడవుగా ఉంటుంది. అలాగే పాయల్ వైన్ తాగడం అనేది ఒక సాధారణ మహిళ చేయని పని. ఈ పుస్తకంలోని ఒక మంచి విషయం ఏమిటంటే, చేతన్ భగత్ జైన్ , ఖత్రిలు రెండు వర్గాల మధ్య కథను అద్భుతంగా అల్లారు. సాకేత్ ఖురానా ఒక ఖత్రి, పాయల్ జైన్ ఒక జైన. ఇద్దరూ ఉన్నత విద్యావంతులు, ఒకరికొకరు సరిపోయారు.**

ఒకరు ఇంగ్లాండ్‌లో, మరొకరు ఐఐటిలో చదువుకున్నారు, ఇద్దరూ ఒకరికొకరు తగినవారే. ఆమె స్టాన్‌ఫోర్డ్‌లో చదువుకుంది. సాకేత్ సంప్రదాయాలు అతనికి మాంసం తినడానికి, మద్యం తాగడానికి అనుమతించాయి. దీనికి విరుద్ధంగా, పాయల్‌కు మాంసం తినడానికి, మద్యం తాగడానికి, ఉల్లిపాయ, వెల్లుల్లి తినడానికి, అబ్బాయిలను చూడటానికి అనుమతి లేదు. జైనులకు అనుకూలమైన ఏదైనా ఆమె షరతులపై అనుమతించబడింది. ఈ మొత్తం కథ సాకేత్, పాయల్ అనే జంటను విజయవంతం చేయడానికి, దానిని నిలబెట్టుకోవడానికి, కబీర్ అనే బిడ్డను కనడానికి చేసే పోరాటం. ప్రారంభ దశలో, అతనికి 3 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు, అతను అచ్చం తన తండ్రిలాగే కనిపిస్తాడు – సరదాగా జోకులు వేస్తూ, అందరినీ నవ్విస్తూ ఉంటాడు. మన జీవితంలో ఉండవలసిన మంచి విషయమే ఇది, కానీ మన జీవితాన్ని నవ్వడం అనే చర్యగా మార్చుకోకూడదు, దీనిని తెలుగులో 'నవ్వులపాలు' అని అనువదిస్తారు. ఈ పుస్తకంలో చేతన్, పాయల్ డిప్‌గా ఉపయోగించే జైన్ ల హమ్మస్ వంటి కొన్ని పదాలను ప్రస్తావించారు. అంటే ఆ ఆహార పదార్థంలో ముంచి తినడం, వినడానికి చెవులకు చాలా ఆహ్లాదకరంగా అనిపించింది. అంతేకాకుండా, పుస్తకం ముగింపులో సాకేత్ చెప్పిన (Will you be mine forever?) 'నువ్వు ఎప్పటికీ నా దానివై ఉంటావా?' అనే మాటలు చాలా రొమాంటిక్‌గా ఉండి, చదివే ప్రజలలో అలాంటి భావాలను రేకెత్తించాయి. చేతన్ భగత్ రచనలు పాఠకులపై ప్రభావం చూపుతాయి – అది ప్రేమ కావచ్చు లేదా జీవిత పాఠాలు కావచ్చు.

**ఒక సినిమా ఉదాహరణగా - ఖలేజా సినిమాలో రావు రమేష్, మహేష్ బాబుతో 'నువ్వు దేవుడు' అని చెప్పే సన్నివేశం ఉంటుంది. అలాగే, చేతన్ భగత్ కూడా తన రచనల ద్వారా లక్షలాది మంది పాఠకులకు మార్గదర్శకుడిలా ఉంటాడు. ఎందుకంటే నేను చెప్పడం లేదు..**

ఎందుకంటే అతను నవలలు రాస్తూ మనల్ని అలరిస్తున్నాడు కానీ '11 రూల్స్ ఆఫ్ లైఫ్' వంటి పుస్తకాలు రాసి జీవితానికి మార్గదర్శక జ్ఞానాన్ని అందించడం లేదు. అలాగే ఈ పుస్తకంలో నాకు నచ్చని విషయం ఏమిటంటే, చేతన్ తన రచనలలో అసభ్యకరమైన భాషను ఉపయోగించడం. సాకేత్ తను విడాకులు తీసుకున్న మాజీ భార్య రాశి పట్ల వాడిన పదాలు. అతని మాజీ భార్య అయినప్పటికీ, ఆమె ఒక మహిళ, ఆమెకు ప్రాథమిక హక్కులు ఉన్నాయి, అంటే రాశి. అతని మాజీ భార్యగా గౌరవించబడే హక్కు ఆమెకు ఉంది, అదే నేను చెప్పాలనుకుంటున్న విషయం. రాశిని ఒక దురాశపరురాలు అని కించపరిచే పదాలు వాడటం, అతను స్త్రీలను గౌరవించే పద్ధతి ఇదేనా? అతను స్త్రీలను గౌరవించే పద్ధతి ఇదేనా? అదే తన తల్లి అయితే అతను అలాగే ప్రవర్తిస్తాడా? జననాంగాలను కించపరిచే వ్యాఖ్యలను కూడా చూడటం భరించలేనంతగా ఉంది. రచయిత చేతన్ భగత్ ఉన్నత విద్యావంతుడు, ఐఐటి/ఐఐఎం నుండి పట్టభద్రుడైనప్పటికీ, తన భార్య అనూషతో ప్రేమ వివాహం చేసుకున్నాడు. అతను మహిళల పట్ల గౌరవం లేనివాడని. అనిపిస్తుంది . అతను మహిళలను ఉద్దేశించి ఇలాంటి పదాలు వాడటం మొదలుపెట్టాడు. చేతన్, కాస్త మర్యాదగా ఉండు!

ప్రస్తుతం ఈ పుస్తకాలలో ఉపయోగించిన భాషను బట్టి, నాలో ఒక బలమైన నిబద్ధత ఏర్పడింది. నేను ఒక బలమైన స్త్రీవాదిగా నన్ను నేను అంకితం చేసుకోవాలనుకుంటున్నాను. నేను మహిళల కోసం చట్టాన్ని కాపాడాలనుకుంటున్నాను. అలాగే మహిళలపై జరిగే అఘాయిత్యాలు ఆగిపోతాయి. ఇలాంటి పుస్తకాలలో ఇటువంటి భాషను ప్రోత్సహించనప్పుడు ఇది సాధ్యమవుతుంది. కాబట్టి, ఇందులో మంచి శృంగార సారం ఉన్నప్పటికీ, ఇటువంటి పదాలపై/ వాక్యాలపై నిషేధం విధించాలని, దీనిని చదవడాన్ని ప్రోత్సహించవద్దని నేను ఇతరులను కోరాలని నిర్ణయించుకున్నాను. మనం చర్య తీసుకోకపోతే, మహిళలపై అనేక అకృత్యాలు జరుగుతాయని, 'దిశ' ఘటన వంటి అత్యాచార కేసులు మరిన్ని వెలుగుచూస్తాయని, ఈ పుస్తకంలోని భాష ఇటువంటి నేరాలను మరింత ప్రేరేపిస్తుందని నేను భయపడుతున్నాను. ఈ పుస్తకంలో నాకు బాగా నచ్చిన విషయం ఏమిటంటే సాకేత్ పడిన కఠోర శ్రమ. స్టాండప్ కామెడీలో కొన్నిసార్లు ప్రేక్షకులను పేర్లు పెట్టి పిలవడం ద్వారా విఫలమైనప్పటికీ, ఆ రంగం నుండి ప్రైవేట్ ఈక్విటీ వ్యాపార యజమాని స్థాయికి ఎదిగాడు. ఆ వ్యాపారం అతన్ని ఎంతగా ధనవంతుడిని చేసిందంటే, విమాన ప్రయాణాల్లో ఎకానమీ లేదా అంతకంటే తక్కువ స్థాయి నుండి బిజినెస్ క్లాస్‌కు మారగలిగే స్థాయికి చేరుకున్నాడు. ఈ పుస్తకంలో నాకు కాస్త వింతగా అనిపించిన ఒక విషయం ఉంది. చేతన్ భగత్ పుస్తకాలు చదవడానికి నిఘంటువు (dictionary) అవసరం లేదని ప్రజలు అంటుంటారు–బహుశా రచయిత కూడా ఇదే చెప్పారేమో–కానీ నాకు మాత్రం అది అవసరమైంది; లేదా వారు 'ఎక్కువగా అవసరం ఉండదు' అని చెప్పి ఉంటారేమో. ఇంటర్మీడియట్ స్థాయి నుండే నేను చేతన్ భగత్ పుస్తకాలను ఆస్వాదిస్తూ వస్తున్నాను. 2 Statవం పుస్తకం చదివినప్పుడు నా ఒళ్లు గగుర్పొడిచింది. Five Point Someone పుస్తకం, అలాగే 2017 IIT JEE అడ్వాన్స్‌డ్ టాపర్ సర్వేష్ మెహతాని– వీరిద్దరూ నన్ను IITలో సీటు సాధించడానికి ప్రయత్నించేలా ప్రేరేపించారు; కానీ దురదృష్టవశాత్తు నేను JEE Mains పరీక్షను కూడా ఉత్తీర్ణం కాలేకపోయాను. మొత్తంగా ఈ పుస్తకంలో ప్రేమ, హాస్యం, జీవిత పాఠాలు ఉన్నప్పటికీ, కొన్ని అంశాలు అసహ్యంగా అనిపించాయి. అయినప్పటికీ ఇది ఆలోచింపజేసే పుస్తకం. చేతన్ తన రచనలో ఎంతో గొప్ప పదసంపదను ఉపయోగించాడు. eerie silenceµ, equivalent to death µ లాంటి పదాలు ఒక స్టాండ్‌అప్ కామెడియన్ గురించి రాయడంలో అతని రచనా నైపుణ్యాన్ని చూపిస్తున్నాయి. but bro behind the stage there is pandemonium... అనే జోక్ నాకు చాలా నచ్చింది. స్టేజ్ వెనుక గందరగోళం జరుగుతోంది. టీచర్ చాలా టెన్షన్‌లో ఉంది. ఆమెకు స్వేచ్ఛ లేకుండా, పిల్లల్ని సమన్వయం చేస్తూ స్టేజ్ మీదకి పంపడానికి కష్టపడుతోంది. ఆమె అరుస్తోంది – 'ఓయ్ గాంధీజీ ఎక్కడ? బాత్రూంలోనా? ఇది బాత్రూం వెళ్లే టైమా?' అని. ఆ జోక్ చెప్పిన విధానం కూడా అద్భుతంగా ఉంది – phew! అని చెప్పడం ఒక కళాకారుడే చేయగలడు.

**'గాంధీజీగా క్లాస్ 3–డీ స్టూడెంట్ మనీష్ వర్మ స్టేజ్ మీదకి వస్తాడు. అతను ధరించిన ధోతీతో అసౌకర్యంగా ఉంటాడు. మిసెస్ దత్తా అతని చెవిని లాగి, చెంప దెబ్బ కొట్టి – 'ఎక్కడికి పోయావు? వెంటనే స్టేజ్ మీదకి వెళ్లు, లేదంటే ఇంకో చెంపదెబ్బ !' అని అంటుంది.**

**ఇవి అన్నీ మనకు హృదయపూర్వకంగా నవ్వు తెప్పిస్తాయి. చేతన్ భగత్ ప్రత్యేకత ఏమిటంటే - ఆయన ఇలా మనల్ని నవ్వించగలడు. స్టేజ్ వెనుక ఎవరూ అహింస గురించి ఆలోచించడం లేదు. మిసెస్ దత్తా భయంతో 'గాంధీజీ' స్టేజ్ మీదకి పరుగెత్తి వెళ్తాడు.**

'సుభాష్ చంద్ర బోస్ ఎక్కడ?' అని మిసెస్ దత్తా మళ్లీ అరుస్తుంది – 'బటన్లు వేసుకుని, టోపీ పెట్టుకుని వెంటనే వెళ్లిపో!' అని. అప్పుడు ప్రేక్షకులు పెద్దగా నవ్వే ఒక గొప్ప క్షణం వస్తుంది. అయితే, ఆయన ఒక ఫెయిల్యూర్ కథను ఎంచుకోవడం మంచి విషయం. ఎందుకంటే విజయానికి ముందు వైఫల్యాలు ఉంటాయి. failures are stepping stones to successµ అనే భావనను ఈ పుస్తకం చెబుతుంది. Hi, Im Saketh Khurana... నా జీవితం ఎక్కడికీ వెళ్లడం లేదు. నేను ఒక ఫెయిల్డ్ హజ్బండ్, కెరీర్ వదిలేసిన వాడిని, అంత గొప్ప స్టాండ్‌అప్ కామెడియన్ కూడా కాదు...' అనే లైన్ చాలా ప్రభావవంతంగా ఉంది. ' నేను నా రోజులను నా జోకులపై పనిచేయడానికో లేదా నా విడాకుల పరిష్కారంపై పనిచేయడానికో గడుపుతాను, అది కూడా ఒక రకమైన జోకే.' ఇలా ఉంటుంది అతని స్టాండ్ అప్ కామెడీ.

పుస్తకంలో కథానాయకుడికి తన భార్యతో సత్సంబంధాలు లేనప్పుడు, ఒక వాక్యం ఉదహరించబడింది: 'ఈలోగా, నేను మరింత తీవ్రమైన నిరాశలోకి కూరుకుపోయాను, మద్యం నా ప్రాణస్నేహితుడయ్యింది. 'భార్యతో సత్సంబంధాలు ఏర్పరచుకోలేకపోవడం వల్ల కలిగే బాధ నుండి ఉపశమనం పొందడానికి మద్యం సేవించడం పరిష్కారం కాకూడదు. అతని భార్య అతన్ని విడిచిపెట్టినప్పుడు, పుస్తకంలో ఒక వాక్యం ఉదహరించబడింది: 'వాళ్ళు మీకు మద్యం ఇచ్చి నవ్విస్తారు. సమస్యల నుండి పారిపోవడానికి ఇంతకంటే మంచి మార్గం ఏముంది, కొన్ని గంటలకైనా సరే? ఇది పూర్తిగా తప్పుదారి పట్టించేది. ఇది మన ఆరోగ్యాన్ని పాడు చేస్తుంది, కాలేయాన్ని దెబ్బతీస్తుంది.' పుస్తకం నుండి ఉదహరించబడిన ఈ జోక్ కూడా నాకు నచ్చింది, అది ఈ క్రింది విధంగా ఉంది: 'ఆమె నాకంటే చాలా చిన్నది కదా' 'సరే, అంత చిన్న వయసు కాదు, ఆమె ఓటు వేయగలదని నేను అనుకుంటున్నాను', అక్కడక్కడా కొన్ని నవ్వులు . అయితే, మద్యం ద్వారా బాధను మర్చిపోవడం సరైంది కాదు. అది ఆరోగ్యాన్ని పాడు చేస్తుంది, ముఖ్యంగా లివర్‌కు నష్టం చేస్తుంది. they give you alcohol and make you laugh... అనే లైన్ తప్పుదారి పట్టించేలా ఉంది.

ఇంకా కొన్ని జోకులు కూడా బాగున్నాయి: 'ఆమె నాకంటే చిన్నదే.. ఓటు వేయగలిగేంత చిన్నది కాదు అనుకుంటా' – ఈ లైన్ కూడా నవ్వు తెప్పిస్తుంది. ఈ కథలో ప్రధాన మలుపు – పరిమల్ జైన్ 'కమాల్ కా రిష్తా' వల్ల పాయల్ జైన్, సాకేత్ ఖురానా ప్రేమలో సమస్యలు రావడం.

**చేతన్ భగత్ కొన్ని అద్భుతమైన లైన్లు రాశాడు: 'పురుషులు తమ ప్రేమ కోసం యుద్ధాలు కూడా చేశారు... నువ్వు కాస్త కేబుల్స్ కూడా సెట్ చేయలేవా?' కానీ చివర్లో but I do comedy అనే ముగింపు కొంచెం అర్థంలేని విధంగా అనిపిస్తుంది.**

ఇంకో లైన్: 'ఈ ఇంట్లో మనం స్వేచ్ఛగా మాట్లాడుకునే వాతావరణం ఉందా?' – ఇది తల్లిదండ్రులు పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వడం లేదనే భావనను చూపిస్తుంది. పాయల్ తన జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కు లేకపోవడం బాధాకరం. కానీ ఇది ఫిక్షన్ కావడంతో నాటకీయంగా చివరికి ఆమె సాకేత్‌ను పెళ్లి చేసుకుంటుంది.

ప్రేమ గురించి కొన్ని అద్భుతమైన లైన్లు: 'ప్రేమ మనుషులను విచిత్రమైన పనులు చేయిస్తుంది... గోడలు ఎక్కిస్తుంది, కొండలు ఎక్కిస్తుంది... యుద్ధాలు కూడా చేయిస్తుంది... నేను మాత్రం ఎలివేటర్ ఎక్కాను!' ప్రేమలో కేవలం భావాలు కాదు – కృషి, అనుకూలత, కెమిస్ట్రీ అన్నీ అవసరం. పౌలో కొయెలో The Alchemist లో చెప్పినట్లు – మనం నిజంగా ఏదైనా కోరుకుంటే ప్రపంచం మొత్తం మనకు సహాయం చేస్తుంది. అదే విధంగా ఈ పుస్తకం లో పాయల్ సాకేత్ కథలో మనకి సహాయం కనిపిస్తుంది. కానీ ఈ పుస్తకంలో నాకిష్టం లేని విషయం – అమ్మాయిలు అయిన తానియా, పాయల్ మద్యం తాగడం చూపించడం. అయితే ఈ నవల మంచి పదసంపదను ఇస్తుంది. woolly-headedµ, peppy beat లాంటి పదాలు చాలా ఆసక్తికరంగా ఉన్నాయి. పాయల్ దయ నాకు చాలా నచ్చింది. జగ్లర్ ఏమీ అడగకపోయినా, ఆమె తన పర్స్ నుండి డబ్బు ఇవ్వడం ఆమె మంచి మనసును చూపిస్తుంది. ఒక సినిమా డైలాగ్ ఉంది: 'మంచితనానికి ఇవి రోజులు కావు సార్' – కానీ ఈ పుస్తకం చూస్తే ఇంకా మంచి మనుషులు ఉన్నారని అనిపిస్తుంది.



ఇట్యాల శ్రీరామ్
8341843420

ఈవార్తలు
వినోదవాణి
CINEMA
శుక్రవారం 20-3-2026, జగిత్యాల | www.evarthalu.com 

లవ్లీ చిత్రం


నేహా శెట్టి





# అట్టహాసంగా గద్దర్ అవార్డుల ఫంక్షన్

## పాల్గొన్న సినీ, రాజకీయ ప్రముఖులు



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2025' పురస్కారాల ప్రదానోత్సవం హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మార్చి 19, గురువారం సాయంత్రం హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ వేడుకకు సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై ప్రత్యేక శోభను తెచ్చారు. ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి తన అర్ధాంగి సురేఖతో కలిసి హాజరుకాగా, కింగ్ నాగార్జున అమలతో విచ్చేశారు. యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్, నూతన దంపతులు నాగచైతన్య–శోభిత ధూళిపాళ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథులుగా పాల్గొని, చిరంజీవితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2025లో విడుదలైన చిత్రాలకు గాను పలు విభాగాల్లో అవార్డులు అందించారు. "తండేల్" చిత్రానికి గాను నాగచైతన్య ఉత్తమ నటుడిగా, "ది గర్ల్ ఫ్రెండ్" చిత్రానికి రష్మిక మందన్న ఉత్తమ నటిగా అవార్డులు అందుకున్నారు. "రాజు వెడ్స్ రాంబాయి" ఉత్తమ చిత్రంగా నిలవగా, అదే చిత్రానికి సాయిలు ఉత్తమ దర్శకుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం, కమల్ హాసన్‌కు పైడి జైరాజ్ ఫిల్మ్ అవార్డు, అలనాటి నటి జయసుధకు ఏఎన్నార్ ఫిల్మ్ అవార్డు అందజేశారు. సుమ కనకాల, ప్రదీప్ మాచిరాజు వ్యాఖ్యానంతో సాగిన ఈ వేడుకలో నటి నిధి అగర్వాల్ డ్యాన్స్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



## అనుష్కకు వయసుతో పనిలేదండి..!



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి వివాహం గురించి గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్న వార్తలపై ఆమె వ్యక్తిగత బృందం 'టీమ్ అనుష్క' తీవ్రంగా స్పందించింది. ఒక వ్యాపారవేత్తతో అనుష్క పెళ్లి ఖాయమైందంటూ వస్తున్న కథనాలను ఖండిస్తూ, మీడియా సంస్థల తీరుపై మండిపడింది. కేవలం వ్యూస్, క్లిక్స్ కోసం ఒక నటి వ్యక్తిగత జీవితాన్ని బజారున పడేయడం సరికాదని హితవు పలికింది. తాజా ప్రకటనలో టీమ్ అనుష్క ప్రధానంగా వయసు అంశాన్ని ప్రస్తావించింది. ప్రతి వార్తలోనూ అనుష్క వయసు '44 ఏళ్లు' అని ప్రత్యేకంగా హైలైట్ చేస్తూ చర్చించడాన్ని తప్పుబట్టింది. "వయసు అనేది నిజంగా చర్చించాల్సిన సమస్య అయితే, ఇదే ఉత్సాహం సీనియర్ హీరోల వయసు విషయంలో ఎందుకు కనిపించదు? కేవలం మహిళా నటీమణులనే టార్గెట్ చేయడం వివక్ష కాదా?" అని ఘాటుగా ప్రశ్నించింది. అనుష్క తన సినీ కెరీర్‌ను కేవలం కష్టం, ప్రతిభతోనే నిర్మించుకున్నారని, ఆమె ఎప్పుడూ చీప్ పబ్లిసిటీ కోసం ప్రయత్నించలేదని టీమ్ గుర్తు చేసింది. ఒక నటిగా ఆమె సాధించిన విజయాలను పక్కన పెట్టి, కేవలం పెళ్లి, వయసు వంటి అంశాలనే హైలైట్ చేయడం అన్యాయమని పేర్కొంది. "వివాహం అనేది ఒక వ్యక్తిగత విషయం, అది బ్రేకింగ్ న్యూస్ కాదు. సోషల్ మీడియా ట్రెండ్ అసలే కాదు" అని స్పష్టం చేస్తూ, ఆమె వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని విజ్ఞప్తి చేసింది.



## ఆ బాధను మర్చిపోలేను: హేమ

గత రెండేళ్లుగా తనపై వచ్చిన డ్రగ్స్ ఆరోపణలు, న్యాయపోరాటం, తాను ఎదుర్కొన్న మానసిక క్షోభపై సీనియర్ సినీ నటి హేమ భావోద్వేగంగా స్పందించారు. 2024 మే నెలలో బెంగళూరు ఎలక్ట్రానిక్స్ సిటీ సమీపంలోని జీఆర్ ఫామ్ హౌస్‌పై జరిగిన పోలీసు దాడి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ సమయంలో హేమతో పాటు పలువురు ప్రముఖుల పేర్లు ఛార్జ్ షీట్‌లో చేర్చడంపై ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "నేను ఒక సెలబ్రిటీని కావడం వల్లే నాపై లేనిపోని ప్రచారం చేశారు. నేను ఏ తప్పూ చేయలేదని మొత్తుకున్నా ఎవరూ నమ్మలేదు. కొన్ని మీడియా సంస్థలు తనపై ఆరోపణలను హైలైట్ చేసినంతగా, నేను నిర్దోషినని కోర్టు తేల్చిన విషయాన్ని ప్రచారం చేయలేదు" అని ఆమె విమర్శించారు. సుమారు వెయ్యి పేజీల ఛార్జ్ షీట్, నెలల తరబడి సాగిన విచారణ అనంతరం 2025 జనవరి 2న బెంగళూరు కోర్టు హేమ డ్రగ్స్ తీసుకోలేదని స్పష్టం చేస్తూ తీర్పునిచ్చింది. ఈ తీర్పు తన నిజాయతీకి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఆ సమయంలో తాను అనుభవించిన మానసిక ఒత్తిడి వర్ణనాతీతమని, కేవలం కోర్టు తీర్పు తర్వాతే తనకు గౌరవం దక్కిందని ఆవేదన వ్యక్తం చేశారు. "డ్రగ్స్ కేసులో అరెస్టయినంత మాత్రాన లేదా జైలుకు వెళ్లినంత మాత్రాన వారు నేరం చేసినట్లు కాదు.



# విద్యాదానం చేస్తా

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి మరోసారి తన సేవా గుణాన్ని చాటుకున్నారు. ఇప్పటికే బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ వంటి సేవా కార్యక్రమాలతో వేలాది మందికి అండగా నిలుస్తున్న ఆయన, ఈ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు గుడ్ న్యూస్ చెప్పారు. భవిష్యత్తులో విద్యాదానంపై దృష్టి సారించనున్నట్లు ప్రకటించారు. ఉగాది సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న చిరంజీవి తన సేవా ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. రక్తం కొరత వల్ల ప్రాణాలు కోల్పోతున్న సందర్భాలు తనను కదిలించాయని, అందుకే 1998లో బ్లడ్ బ్యాంక్‌ను స్థాపించి అభిమానులను రక్తదానానికి ప్రేరేపించానని తెలిపారు. అదే సమయంలో ఐ బ్యాంక్ సేవలను కూడా ప్రారంభించి అత్యవసర సమయంలో ప్రాణదాతగా నిలిచేలా వ్యవస్థను తీర్చిదిద్దినట్లు చెప్పారు. అయితే తన సేవలను అక్కడితో ఆపాలని ఎప్పుడూ అనుకోలేదని, ఇప్పుడు విద్యా రంగంలో సేవలు అందించే దిశగా అడుగులు వేయాలని భావిస్తున్నానని వెల్లడించారు. ప్రముఖ నటుడు సూర్య స్థాపించిన అగరం ఫౌండేషన్ స్ఫూర్తిగా తీసుకొని, పేదలకు ఉచిత విద్య అందించే కార్యక్రమాన్ని ప్రారంభించాలనుకుంటున్నట్లు తెలిపారు. కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా, ఎక్కడైతే విద్య అవసరం ఉంటుందో అక్కడ సహాయం అందించేలా కృషి చేస్తాను అని చిరంజీవి స్పష్టం చేశారు. త్వరలోనే ఈ విద్యా పథకానికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రకటిస్తామని తెలిపారు. ఇప్పటికే చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ సేవలతో పాటు పేదలకు వైద్య సహాయం, ఆర్థిక సాయం అందిస్తున్నారు. కరోనా సమయంలో ఆక్సిజన్ సిలిండర్ల పంపిణీ, వైద్య సహాయంతో కూడా ఎంతోమందికి అండగా నిలిచారు. ఈ సేవా కార్యక్రమాలను ప్రస్తుతం ఆయన కుమారుడు రామ్ చరణ్ పర్యవేక్షిస్తున్నారు. ట్రస్ట్ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించారు. మొత్తానికి, సినిమాలతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ ముందుండే చిరంజీవి మరోసారి తన గొప్ప మనసును చాటుకోవడంతో అభిమానులు, నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

## మోహన్ బాబు బర్త్‌డే ట్రీట్..

లెజెండరీ నటుడు, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. నేచురల్ స్టార్ నాని




హీరోగా నటిస్తున్న భారీ పాన్–ఇండియా చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి చిత్రయూనిట్ ఓ ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. ఈ సినిమాలో మోహన్ బాబు అత్యంత శక్తిమంతమైన విలన్ పాత్రలో నటిస్తున్నట్లు ప్రకటించింది. ఈ చిత్రంలో మోహన్ బాబు 'శికంజా మాలిక్' అనే పవర్‌ఫుల్, డార్క్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు. ఆయన పుట్టినరోజున శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం విడుదల చేసిన వీడియోలో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ తరం వారికి అసలు సిసలు మోహన్ బాబు అంటే తెలియదు. 'ప్యారడైజ్' సినిమాతో మోహన్ బాబు అంటే ఏంటో చూపిస్తాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ మాటలతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగాయి.




# క్రికెట్ బాల్స్ దొరకట్లే!

## యుద్ధంతో ఇంగ్లాండ్ బోర్డుకు చిక్కులు

అమెరికా–ఇజ్రాయెల్‌తో ఇరాన్ యుద్ధం ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుకు కొత్త చిక్కును తీసుకొచ్చేలా ఉంది. మరికొద్ది రోజుల్లో కొత్త సీజన్ ప్రారంభం కానున్న వేళ.. ఈసీబీని డ్యూక్ బంతుల కొరత వెంటాడనుంది. గల్ఫ్ నుంచి వెళ్లే రవాణా మార్గాలకు తీవ్ర అంతరాయం కలుగుతుండటంతో ఉపఖండం నుంచి యూకేకు సరఫరా క్లిష్టంగా మారింది. విమానాల్లో సరకు రవాణా చేయించాలంటే ప్రస్తుతం వెచ్చిస్తోన్న దానికంటే మూడు రెట్లు అధికమొత్తం చెల్లించాల్సిన పరిస్థితి. ప్రస్తుతం ఉన్న సాధారణ కోటాలో డ్యూక్ బంతులు సగమే అందుబాటులో ఉన్నట్లు ఈసీబీ వర్గాలు వెల్లడించాయి. యుద్ధం ఇలానే కొనసాగితే.. రాబోయే నెలల్లో మ్యాచ్‌ల సన్నద్ధతకు ఇబ్బందులు తప్పవని ఈసీబీ ఆందోళన చెందుతోంది. ఏప్రిల్ 3 నుంచి ఇంగ్లాండ్ క్రికెట్ కొత్త సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పటికే బంతుల కొరత వెంటాడుతోంది. డ్యూక్స్ బంతులను స్వదేశంలో జరిగే టెస్టులతోపాటు కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో వినియోగిస్తారు. తయారీదారు బ్రిటిష్ క్రికెట్ బాల్స్ లిమిటెడ్ సంస్థ ఓనర్ దిలీప్ జజోడియా స్పందిస్తూ.. "మున్ముందూ ఇలాగే కొనసాగితే బంతుల కొరత తీవ్రంగా ఉంటుంది. ఇప్పటికే 13 ఫస్ట్ క్లాస్ క్లబ్‌లకు సరఫరా తగ్గించినట్టు తెలియజేశాం. ఉపఖండంలోని ఫ్యాక్టరీల్లో సరకు రెడీగా ఉంది. కానీ, షిప్పింగ్ సమస్యగా మారింది. అక్కడ నుంచి తెప్పించేందుకు విమానయాన సంస్థలను సంప్రదించినా ఫలితం లేకుండాపోతోంది" అని వెల్లడించారు.

# శ్రేయస్‌కు అంతెందుకు అన్నారు?

శ్రేయస్ అయ్యర్ ఐపీఎల్ 2015 సీజన్‌లో తొలిసారి వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుతో చేరాడు. అప్పుడు అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌గానే రూ. 2.6 కోట్లను దక్కించుకోవడం గమనార్హం. అతడిపై అంత సొమ్ము ఎందుకు వెచ్చించారనే విమర్శలూ వచ్చినట్లు తాజాగా ఢిల్లీకి కోచ్‌గా పనిచేసిన ప్రవీణ్ ఆమ్రే గుర్తు చేసుకున్నారు. అయితే, ఆ సీజన్‌లో అతడు యువరాజ్ కంటే ఎక్కువ పరుగులు చేయడం గమనార్హం. 'శ్రేయస్ అయ్యర్ నాకు పదేళ్ల కిందట నుంచి తెలుసు. తొలిసారి 2015 ఐపీఎల్ సీజన్ కోసం జరిగిన వేలంలో అతడి పేరు చూశా. అప్పుడు అతడి ప్రాథమిక ధర రూ.10 లక్షలు. వేలంలో రూ. 2.6 కోట్లు సొంతం చేసుకున్నాడు. ఢిల్లీ తీసుకున్న తొలి అన్‌క్యాప్‌డ్ ప్లేయర్ అతడు. అంతకుముందు వరకూ ఒక్క టీ20 మ్యాచ్ కూడా శ్రేయస్ ఆడలేదు. కానీ, కోచ్‌గా అతడు సాధిస్తాడనే నమ్మకం ఉంది. మా ఓనర్ కిరణ్ కుమార్ గ్రంధి కూడా నన్ను నమ్మారు. అప్పుడు శ్రేయస్ వయసు 20 ఏళ్లలోపే ఉంటాయనుకుంటా. ఇలాంటి కుర్రాడికి ఎందుకు ఇంత మొత్తం అనేవాళ్లూ లేకపోలేరు. ఆ ఏడాది యువరాజ్ సింగ్‌కు రూ. 16 కోట్లు ఇచ్చారు. కానీ, అతడు 250లోపే పరుగులు చేశాడు. కానీ, శ్రేయస్ అయ్యర్ మాత్రం 400కిపైగా పరుగులు సాధించాడు. ఆ తర్వాత ఢిల్లీకి సారథి కోసం చూస్తుంటే నేనే శ్రేయస్‌ను సిఫార్సు చేశా. అతడు చేయగలడని నాకు అనిపించింది' అని ఆమ్రే వెల్లడించారు.



# ఢిల్లీ ఫీల్డింగ్ కోచ్‌గా జాన్ మూనీ




ఢిల్లీ క్యాపిటల్స్ ఐర్లాండ్ దిగ్గజం జాన్ మూనీని ఫీల్డింగ్ కోచ్‌గా నియమించింది. ఐపీఎల్ ట్రోఫీ కోసం నిరీక్షిస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లలో ఫీల్డింగ్ నైపుణ్యాల మెరుగుపరిచేందుకు కొత్త కోచ్‌ను నియమించింది. ఈ విషయాన్ని గురువారం ఢిల్లీ యాజమాన్యం ఎక్స్ వేదికగా వెల్లడించింది. 'పటిష్టమైన ఢిల్లీ డిఫెన్స్‌కు కొద్దిగా ఐరిష్ స్టీల్ జత చేద్దాం.. జాన్ మూనీ స్వాగతం' అంటూ ఎక్స్‌లో ఫ్రాంచైజీ పోస్ట్ పెట్టింది. ఐర్లాండ్ మాజీ ఆల్‌రౌండర్ జాన్ మూనీకి ఫీల్డింగ్ కోచ్‌గా తీసుకుంది. 44 ఏళ్ల మూనీకి టీ20లో కోచ్‌గా సుదీర్ఘ అనుభవముంది. 2015లో వీడ్కోలు అనంతరం ఇంగ్లండ్ బోర్డు నుంచి లెవల్ 1, 2, 3 కోచింగ్ కోర్సులు పూర్తి చేసిన మూనీ.. 2018 నుంచి 2019 వరకూ అఫ్గనిస్థాన్ ఫీల్డింగ్ కోచ్‌గా సేవలందించాడు. అనంతరం వెస్టిండీస్ జట్టుకు సైతం పని చేసిన అతడు.. ఐర్లాండ్ మహిళల జట్టుకూ కోచ్‌గా వ్యవహరించాడు. పొట్టి క్రికెట్‌లో ఫీల్డింగ్ కోచ్‌గా రాణిస్తున్న మూనీని ఢిల్లీ క్యాపిటల్స్ తమ గూటికి చేర్చుకుంది. గత సీజన్‌లో కోచ్‌గా వ్యవహరించిన ఆంటోన్ రౌక్స్, జ్ఞానేశ్వర రావ్ స్థానంలో ఈ ఐర్లాండ్ వెటరన్ బాధ్యతలు చేపట్టనున్నాడు. హెడ్‌కోచ్‌గా హేమంగ్ బదాని, బౌలింగ్ కోచ్ మునాఫ్ పటేల్, అసిస్టెంట్ కోచ్‌లు ఇయాన్ బెల్, వేణుగోపాల్ రావులతో కలిసి మూనీ పని చేయనున్నాడు. గత సీజన్‌లో పేలవ ప్రదర్శనతో ఐదో స్థానంలో నిలిచిన ఢిల్లీ.. ఈసారి మెరుగైన ప్రదర్శన చేయాలనుకుంటోంది. అయితే.. నిరుడు డైరెక్టర్ ఆఫ్ క్రికెటర్, మెంటార్‌గా ఉన్న కెవిన్ పీటర్సన్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే.



# మరోసారి తండ్రైన దినేశ్ కార్తీక్

భారత మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్ మరోసారి తండ్రయ్యాడు. అతడి భార్య దీపికా పల్లికల్ గురువారం ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని దినేశ్ కార్తీక్ సోషల్ మీడియా వేదికగా తెలియజేస్తూ తన సంతోషాన్ని పంచుకున్నాడు. తమ కూతురికి 'రాహ'అని పేరు పెట్టినట్టు కార్తీక్ వెల్లడించాడు. దీపికా కూడా స్పోర్ట్స్ పర్సనే. స్క్వాష్‌లో స్టార్ క్రీడాకారిణి. 2015లో కార్తీక్, దీపిక వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇప్పటికే ఇద్దరు కొడుకులు కబీర్, జియాన్. క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన కార్తీక్ ప్రస్తుతం ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు బ్యాటింగ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. మరోవైపు, అంతర్జాతీయ స్క్వాష్ ప్లేయర్ దీపిక 2022లో వరల్డ్ డబుల్స్ చాంపియన్‌షిప్ రెండు స్వర్ణాలు, 2023లో ఆసియా గేమ్స్ మిక్స్‌డ్ డబుల్స్‌లో బంగారు పతకం సాధించింది.



# ధోనీ బ్యాట్ ఊపలేడు: కైఫ్

ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీని ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడించడం సరికాదని మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ అన్నాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా ధోనీని కేవలం బ్యాటింగ్‌కు పరిమితం చేయడం అర్థరహితమన్నాడు. ధోనీ ఒకప్పటిలా 10 బంతుల్లో 30 పరుగులు చేయలేడని స్పష్టం చేశాడు. సంజూ శాంసన్ ఉన్నప్పటికీ ధోనీని వికెట్ కీపర్‌గా ఉపయోగించుకోవాలని సూచించాడు. వికెట్ల వెనుక ఉండి బౌలర్లను గైడ్ చేయడం, ఫీల్డ్ సెట్ చేయడం వంటి పనుల్లో ధోనీకి ఎవరూ సాటి లేరని, అదే జట్టుకు అతిపెద్ద బలం అని కైఫ్ అభిప్రాయపడ్డాడు. తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఐపీఎల్ 2026 సీజన్‌లో ధోనీ పాత్ర గురించి మాట్లాడిన కైఫ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ధోనీని ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడించాలనే వాదనకు నేను వ్యతిరేకం. అలా చేయడం వల్ల జట్టుకు పెద్ద ప్రయోజనం ఉండదు. . ధోనీ 8వ స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడు. కేవలం 6 నుంచి 12 బంతులు ఆడేందుకు ధోనీని ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడించడం సరికాదు. అతను ఇప్పటికే 20 ఓవర్ల పాటు వికెట్ కీపింగ్ చేస్తున్నాడు. 20 ఓవర్ల పాటు వికెట్ల వెనుక ఉండి బౌలర్లను గైడ్ చేయడం, ఫీల్డ్ సెట్ చేయడం వంటి పనుల్లో ధోనీకి ఎవరూ సాటి లేరు. ముఖ్యంగా రుతురాజ్ గైక్వాడ్‌కు ధోనీ అండగా ఉంటాడు. ఒత్తిడిలో ఉన్నప్పుడు గైక్వాడ్‌కు మద్దతుగా నిర్ణయాలు తీసుకుంటాడు. కెప్టెన్‌గా గైక్వాడ్ రాణిస్తున్నా.. ధోనీ ఉన్నంత కాలం నిర్ణయాలన్ని అతనే తీసుకుంటాడు. సంజూ శాంసన్ జట్టులోకి వచ్చినప్పటికీ ధోనీ ఉన్నంత వరకు అతనితోనే వికెట్ కీపింగ్ చేయించాలి. సంజూను ఒక ఫీల్డర్‌గా వాడుకుంటూ.. ధోనీ వారుసుడిగా సిద్ధం చేయాలి. అయితే ఐపీఎల్ మినహా ధోనీ మరే టోర్నీ ఆడటం లేదు. ధోనీని కేవలం ఇంపాక్ట్ ప్లేయర్‌గా బ్యాటింగ్‌కు మాత్రమే పరిమితం చేయడం సరికాదు. ఎందుకంటే ధోనీ ఏడాది పొడవునా క్రికెట్ ఆడడు.గతంలోలా 10 బంతుల్లో 30 పరుగులు చేయలేడు.




# తన్వి ముందంజ

ఒర్లీన్స్ మాస్టర్స్ టోర్నీలో భారత యువ షట్లర్ తన్విశర్మ ముందంజ వేసింది. పోటీల రెండో రోజైన గురువారం జరిగిన మహిళల సింగిల్స్‌లో తన్వి 21–14, 21–17తో భారత్‌కే చెందిన అన్మోల్ కర్బ్‌పై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన ఈ వరల్డ్ జూనియర్ చాంపియన్‌షిప్ రజత విజేత వరుస గేముల్లో ప్రత్యర్థిని చిత్తుచేసింది. మెరుపు స్మాష్‌లకు తోడు నెట్‌గేమ్, డ్రాప్ షాట్లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసింది. మరోవైపు పురుషుల డబుల్స్‌లో హరిహరణ్ అమ్సకరుణన్, ఎమ్ఆర్ అర్జున్ ద్వయం 26–24, 21–4తో అలెగ్జాండర్ డున్, ఆడమ్ ప్రింగ్లె జోడీపై గెలిచి క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది.

# నన్ను కెప్టెన్ చేసింది గంభీర్ కాదు




టీమిండియా టీ20 కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ నియామకం వెనుక ప్రస్తుత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఉన్నాడని అంతా అనుకుంటున్నారు. తన మాట వినే సారథిని గంభీర్ ఎంచుకున్నాడని కూడా అప్పట్లో విమర్శలు వచ్చాయి. కోల్‌కతా నైట్ రైడర్స్ ఫ్రాంచైజీ తరఫున ఈ ఇద్దరు కలిసి ఆడటంతో వారి మధ్య సాన్నిహిత్యం ఉందని, దాంతోనే గంభీర్ ఈ నిర్ణయం తీసుకున్నాడని గతేడాదిన్నరగా ప్రచారం జరుగుతుంది. కానీ తనకు టీ20 సారథ్య బాధ్యతలు దక్కడం వెనుక గంభీర్ లేదని సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెప్టెన్సీ వెనుక ఉన్న నలుగురు వ్యక్తుల వివరాలను సూర్య వెల్లడించాడు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో పాటు రాహుల్ ద్రవిడ్, అప్పటి బీసీసీఐ సెక్రటరీ జై షా కలిసి ఈ నిర్ణయం తీసుకున్నారని సూర్య తెలిపాడు. గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టకముందే తనకు టీ20 కెప్టెన్సీ దక్కిందని స్పష్టం చేశాడు. 'శ్రీలంకతో సిరీస్‌కు మూడు, నాలుగు రోజుల ముందే అప్పటి బీసీసీఐ సెక్రటరీ జై షా నాకు ఫోన్ చేశారు. రాబోయే టీ20 సిరీస్‌కు నేను కెప్టెన్‌గా వ్యవహరించబోతున్నానని తెలియజేశారు. ఈ నిర్ణయం రోహిత్ శర్మ, అజిత్ అగార్కర్ కలిసి తీసుకున్నారు. వారు రాహుల్ ద్రవిడ్, జై షాలతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఈవార్తలు
# ప్రజావాణి
శుక్రవారం 20-3-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు
సంపాదకీయం Editorial

## పల్లెను పట్టిన మత్తు భూతం

**ఒకప్పుడు** డ్రగ్స్ లేదా మత్తు పదార్థాలు అంటే కేవలం నగరాలకే పరిమితం అని, అదీ సంపన్న వర్గాల విలాసమని భావించేవారు. కానీ నేడు పరిస్థితి తలకిందులైంది. తెలంగాణలోని పల్లెపల్లెకూ ఈ మత్తు భూతం విస్తరిస్తోంది. అమాయక యువతను, శ్రమజీవులను తన కోరల్లోకి తీసుకుంటోంది. ఇది కేవలం శాంతిభద్రతల సమస్య మాత్రమే కాదు, సమాజ మూలాలను దెబ్బతీసే ఒక ప్రమాదకర పరిణామం. నగరాల్లో నిఘా పెరగడంతో డ్రగ్స్ ముఠాలు ఇప్పుడు గ్రామాల వైపు మళ్లుతున్నాయి. ఇటీవల మొయినాబాద్ వంటి ప్రాంతాల్లో వెలుగుచూసిన డ్రగ్స్ కేసులు పట్టణ శివారు గ్రామాల్లోనూ మత్తు నెట్వర్క్ ఎంత బలంగా ఉందో చాటిచెబుతున్నాయి. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో గణాంకాల ప్రకారం, 2023లో రూ. 94.39 కోట్లుగా ఉన్న డ్రగ్స్ సీజ్ విలువ, గతేడాది నాటికి రూ. 148.09 కోట్లకు పెరగడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. గ్రామాల్లో సరైన ఉపాధి లేకపోవడం, సామాజిక మాధ్యమాల ప్రభావం, సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశ యువతను ఈ ఊబిలోకి నెడుతున్నాయి. గంజాయి నుంచి సింథటిక్ డ్రగ్స్ వరకు అన్నీ నేడు సుల భంగా అందుబాటులోకి వస్తున్నాయి. పొలాల్లో పనిచేసే కూలీల నుంచి విద్యార్థుల వరకు మత్తుకు బానిసలవుతుండటం ఆందోళనకరం. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, కుటుంబ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తోంది. కేవలం ప్రభుత్వం కేసులు నమోదు చేయడమే కాకుండా, గ్రామ స్థాయిలో నిఘాను పెంచాలి. ముఖ్యంగా విద్యా సంస్థల దగ్గర నిరంతర తనిఖీలు చేపట్టాలి. గ్రామాల్లోని సర్పంచులు, పెద్దలు తమ పరిధిలో అపరిచిత వ్యక్తుల కదలికలపై కన్నేసి ఉంచాలి. మత్తుకు బానిసైన వారికి పునరావాస కేంద్రాల ద్వారా విముక్తి కలిగించాలి. మత్తు వల్ల కలిగే అనర్థాలపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించాలి. మత్తు రహిత తెలంగాణ సాధించాలంటే అది పోలీసుల బాధ్యత మాత్రమే కాదు, ప్రతి ఒక్కరి కర్తవ్యం. రేపటి తరాన్ని కాపాడుకోవాలంటే పల్లెల్లో వేళ్లూనుకుంటున్న ఈ విష వృక్షాన్ని ఇప్పుడే నరికేయాలి. లేదంటే బంగారు తెలంగాణ.. మత్తు ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది.

# తెలంగాణలో అవధానం!

అవధానం శబ్దానికి మౌలికార్థం ఏకాగ్రత. చిత్తైకాగ్రం అవధానం అని వామనుడు నిర్వచించాడు. చతుష్షష్టికళల్లో అవధానం కూడా పేర్కొనబడింది. అవధానం అంటే మనోయోగం అని శబ్దార్థ కల్పతరువు పేర్కొంటున్నది. వివిధ అంశాలపై ఒకేసారి మనస్సును లగ్నంచేయడమే అవధానమని అనేకమంది పండితులు లాక్షణికులు నిర్వచించారు. క్రమక్రమంగా అది విస్తరించి, ఆశుకవితాధారతో పెనవేసుకొని అవధానం ఒక విస్మయానందకర విద్యగా పరిఢవిల్లింది. అవధానం తెలుగువారి విశిష్టమైన సాహిత్య సంపదగా విరాజిల్లింది. శబ్దపరంగా అవధానం అన్న పదం ఎలావచ్చిందంటే.. – 'డు' ధాఞ్ ధారణ పోషయోః అనే ధాతువుకు 'అవ' ఉపసర్గ చేరి, ల్యుట్ అంతం చేసినప్పుడు 'అవధానం' అనేపదం ఏర్పడినట్లు వ్యాకరణం సూత్రీకరిస్తున్నది. అవధానానికి పంచధకారాలు అవసరమైనవని పండితుల ఉవాచ. అవి ధైర్యం, ధార, ధిషణ, ధోరణి, ధారణ. ఈ ఐదు అంశాలు అవధానిలో పుష్కలంగా ఉన్నప్పుడే ఆ అవధానం పండితుల మన్ననలు పొందుతుందన్నది నిర్వివాదాంశం.



**అవుసుల భానుప్రకాశ్**
పద్యశిల్పి, స్వర్ణకంకణ సత్కార గ్రహీత
ఫోన్ నంబర్: 9603204507

అవధానం సాహిత్యక్రీడ అనీ, విశేషమైన సాహితీ ప్రక్రియ అనీ, ప్రాశ్నికసమాధాన పద్యకేళి అనీ, సాహిత్య గణితసమ్మిళిత విన్యాసమనీ పేరకొనడం జరిగింది. అవధానం కేవలం సాహిత్యానికి మాత్రమే పరిమితమైందా అన్నప్పుడు సాహిత్యేతరాంశాల్లో సైతం అవధానం కన్పిస్తున్నది. ఏదేమైనప్పటికీ "అవధానం" ఒక విశిష్ట సాహిత్యప్రక్రియగాని తనస్థానాన్ని పదిలపరచుకున్నది. "భాషా సాహిత్య రంగాల్లో చేసే అవధానాన్ని కొందరు క్రీడాప్రాయంగా స్వీకరిస్తారు. కానీ అది పాక్షిక సత్యంమాత్రమే. అవధానం కేవలం క్రీడ కాదు. అది కళాక్రీడ. క్రీడ కలిగించే అద్భుత తత్త్వం, కళ అందించే రసానంద తత్త్వం మేళవించుకున్న విద్య అది. పూర్వకాలంలో సంస్కృత విద్వాంసులు అవధానం నిర్వహించేవారు. కానీ ఇప్పటికీ సమస్త భారతీయ భాషల్లో ఈ అవధాన ప్రక్రియ ప్రచలితంగా ఉన్నది తెలుగులోనే." అని అంటారు డా.సి. నారాయణరెడ్డి. ఈ మాటలు ఇప్పటికీ ఎప్పటికీ అక్షర సత్యాలే. తాళపత్రాల దశనుండి తాకేతెరలతో మమేకమైన ఆధునిక దశదాకా అవధానకళ దినదిన ప్రవర్ధమానమవుతూనే ఉన్నది. అవధానుల సంఖ్య నానాటికీ పెరుగుతూనే ఉన్నది. అవధానం ఒక ఆశు కవితావిన్యాసం. దత్తపదుల హేల! వర్ణనల డోల! అడుగడుగునా అడ్డంకుల్ని ఛేదిస్తూ రెండెత్తులతో సాగే నిషేధాల సంకులసమరం! అసంబద్ధమైన పాదాలను సమస్యలుగా ఇస్తే వాటిని మనోరంజకంగా ఔచితీవంతంగా పూరించి సమన్వయపరచే సమస్యాపూరణల తోరణం అవధానం. అస్తవ్యస్తంగా ఇచ్చిన అక్షరాలను క్రమంగా పేర్చుకునే వ్యస్తాక్షరీ పేటిక అవధానం. అక్షరాలను సంఖ్యాత్మకంగా బిగించి ఇస్తే పదాల్లో, పాదాల్లో పటిష్టమైన బిగువుతో కూర్చి చెప్పే న్యస్తాక్షరుల ససుందర శిల్పం అవధానం. ఛందస్సులో సంభాషణలు కొనసాగించే ఛందోభాషణల పాండిత్య క్రీడ అవధానం. కావ్య పురాణాలను పుక్కిట పట్టిన పౌరాణిక కావ్యప్రతిభకు దర్పణం అవధానం. రాగరమ్యంగా సాగిపోయే గానశిల్పం అవధానం. గణితంలోనూ అగణిత ప్రతిభావైదుష్యం ప్రదర్శించేం వారగణనలు, యాంత్రిక గణనల సమ్మిళితమైన మేధాప్రజ్ఞ అవధానం. పువ్వుల్ని విసురుతూనో ఘంటల్ని కొడుతూనో చివర లెక్కతేల్చే గణనశక్తి అవధానం. చమత్కారాలతో, మకతికలతో ఎప్పుడుపడితే అప్పుడడిగే అప్రస్తుతాల హాస్యవినోదం అవధానం. పృచ్ఛకుల సంఖ్య లేదా అంశాల సంఖ్య ఆధారంగా అష్ట, నవ, దశ, ద్విగుణిత, త్రిగుణిత, చతుర్గుణిత, శత, సహస్ర, ద్విసహస్ర, పంచసహస్ర అవధానాలుగా ఆధునిక కాలంలో అవధానం పండితపామర జన రంజకమై అలరారుతూనే ఉన్నది. తెలుగువారి హృదయఫలకంపై విశిష్టస్థానాన్ని అలంకరించుకొని దివ్యశక్తిప్రదాతగా అవధానకళ సజీవమై ప్రస్థానం కొనసాగిస్తూనే ఉన్నది.

### తెలంగాణనేల – అవధాన హేల!

అవధానానికి, అవధానులకూ పుట్టినిల్లు తెలంగాణ. మెతుకుసీమ సిగలో మంజీరానది ఒడ్డున గల కొలిచెలిమె ఈనాడు కొల్చారంగా పిలువబడుతున్న గ్రామంలో జన్మించిన "కోలాచలం పెదమల్లినాథసూరి" మొదటి శతావధాని. ఈయన పదమూడవ శతాబ్దికి చెందినవాడు. కాళిదాసు రచనలకు విశేషమైన వ్యాఖ్యానాలను అందించిన మల్లినాథసూరి, శతావధాని అయిన పెదమల్లినాథసూరి మనుమడు. పెదమల్లినాథసూరి రెండవప్రతాపరుద్ర చక్రవర్తి ఆస్థానకవి. ఆస్థానకవే కాదు, ప్రతాపరుద్రునిచేత కనకాభిషేకం పొందిన అవధానకవి కూడా కావడం మరోవిశేషం. వేటూరి ప్రభాకరశాస్త్రి రచించిన 'కొలచెలమవారు' అన్న వ్యాసం ఈ విశేషాలను ప్రకటిస్తున్నది. సాహిత్యానికి విశేష ప్రాధాన్యతనిచ్చిన రెండవప్రతాపరుద్రుని కాలం సాహిత్యానికి స్వర్ణయుగం కావడం మరొక అద్భుతవిశేషం. పెదమల్లినాథసూరి మొదలు నేటిదాకా అనేకమంది అవధానులు తెలంగాణ నేలలో ప్రభవించి అవధాన సారస్వతసేవలో తరిస్తున్నారు. ఈ తెలంగాణ నేల ఇక్కడి కవులనేకాదు. తెలుగుకవులందరినీ అక్కున చేర్చుకొని గౌరవించిన నేల. ఎక్కెక్కడో ఉన్న అవధానులెందరినో ఆదరించిన నేల. అనేకమంది అవధానులకు, అవధానాలకు వేదికలనిచ్చిన నేల. అందుకే అవధానాన్నీ, తెలంగాణను విడదీసి చూడలేం. విశేషఅవధానాల హేల! తెలంగాణ నేల!



తెలంగాణ – ప్రాచీనావధానులు
కొలచెల్మాన్వయాబ్ధిందుః మల్లినాథో మహాయశాః
శతావధాన విఖ్యాతో
వీర రుద్రాభివర్నితః॥
మల్లినాథాత్మజః శ్రీమాన్ కపర్దీమంత్ర కోవిదః
అఖిల శ్రౌత కల్పస్య కారికా వృత్తి మాతనోత్॥
కపర్దితనయో ధీమాన్మల్లినాథో గ్రజః స్మృతః
ద్వితీయస్తనయో ధీమాన్ పెద్ది భట్టో
మహోదయః॥

అనే వంశావళి శ్లోకపాదాల ద్వారా కొలచెలమ (పెద)మల్లినాథసూరి 'సనాతన ప్రాచీన ఆద్య శతావధాని' అని తెలుస్తున్నది. వారి కుమారుడు కపర్ది అని, కపర్ది కుమారులే కాళిదాసు కావ్యాలకు వ్యాఖ్యానమందించిన మల్లినాథ సూరి అని తెలుస్తున్నది. తెలంగాణ అవధానులకు పుట్టినిల్లు. కాళిదాసు కావ్యాలకు వ్యాఖ్యానమందించిన మల్లినాథసూరి యొక్క తాత అయిన 'పెదమల్లినాథసూరి' తొట్ట తొలి అవధాని. 'కొలచెలమ' వారి ఇంటిపేరు. కాకతీయ చక్రవర్తి రెండవ ప్రతాపరుద్రుని ఆస్థాన కవి ఈయన. వేటూరి వారు ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో ఈవివరాలు పేర్కొంటూ ప్రథమశతావధాని కొలచెలమ మల్లినాథసూరి అనే విషయాన్ని ప్రకటించారు. ఆనాటి కొలచెలమ గ్రామమే కోలాచలంగా మారి ఇప్పుడు కొల్చారం గా స్థిరపడింది. మెదక్ జిల్లాలోని ఈ కొల్చారం గ్రామంలో మల్లినాథసూరి సాహిత్యపీఠం ఏర్పరచాలని విశేష కృషిజరుగుతున్నది. తెలుగుభాషకు సాహిత్యానికి మకుటమై భాసిల్లే అవధానం 13వ శతాబ్దంలో ప్రారంభించబడినట్లు, తొలి అవధాని పెద మల్లినాథసూరియే అని అనిసుస్పష్టమవుతున్నది. చరిగొండ ధర్మన్న చిత్రభారతం రచించాడు. శతావధానిగా సాహిత్యలోకంలో చిరగుర్తింపును పొందిన సత్కవి. తన కావ్య పీఠికలో పేర్కొనబడిన పద్యాల ఆధారంగా ఆయన బిరుదులు సుస్పష్టమవుతున్నవి.

శతలేఖిన్యవధాన పద్యరచనా సంధాసురత్రాణ చి
హ్నితనామా! చరికొండ ధర్మసుకవీ! నీ
వాగ్విలాసంబులా
శితికంఠోజ్జ్వల జూట కోటర కుటీ శీతాంశురేఖా సుధా
న్విత గంగా కనకాబ్జ నిర్భర రసావిర్భూత
మాధుర్యముల్!

అన్న పద్యం ద్వారా చరిగొండధర్మన్న "శతలేఖిన్యవధాన పద్యరచనా సంధాసురత్రాణ చిహ్నిత నాముడ"ని తెలుస్తున్నది. వంద ఘంటములకు పనిచెప్పు నైపుణ్యము కలవాడంటే ఎంతవేగముగా అవధానం చేసి ఉంటాడో ఊహించవచ్చు. ఖమ్మం జిల్లా ఆదికవిగా పేరొందిన హరిభట్టు పూర్తి పేరు హరిహరభట్టు. తిమ్మమాంబ, రాఘవరామచంద్రులు వీరి తల్లిదండ్రులు. మత్స్య, వరాహ,నారసింహ పురాణాలకు తెనుగుసేతనందించారు. స్వయంగా సంస్కృత రచనలను చేసిన అవధానపండితుడీయన. హరిభట్టుకు "అష్టఘంటావధాన విశిష్ట" అనేబిరుదమున్నదని తనకు తానే పేర్కొనడం ద్వారా అవధానం చేయగలిగే దక్షత గలవాడని తెలుస్తున్నది. శతావధాని మరింగంటి జగన్నాథ సూరి అచార్య బిరుదురాజు రామరాజు సేకరించిన 'రాజనీతి రత్నాకరం' పద్యం ఆధారంగా మరింగంటి జగన్నాథసూరి శతావధాని అని స్పష్టమవుతున్నది.

గురు మూర్ధన్య శతావధాన
బిరుదాంకున్, ద్రావిడామ్నాయ త
త్త్వ రసజ్ఞున్, పటు సంస్కృతాంధ్ర
రచనాదక్షున్, హయాధీశ కం
ధర సంలబ్ధ సువర్ణ సృష్టియుతు,
గర్ణాట క్షమాభృత్సభాం
తర పూజ్యున్ మరింగంటి వేంగళ
జగన్నాథాచార్యు గీర్తించెదన్!

అనే పద్యంలో జగన్నాథసూరి పాండిత్యం, భాషాపటిమ, ఆయన బిరుదులు పేర్కొనబడ్డాయి. తెలుగు సాహిత్యంలో మొట్ట మొదటి నిరోష్ఠ్య కావ్యం రచించిన మరింగంటి సింగరాచార్యులు అష్టభాషా ప్రవీణులు. న'సల రాఘవ యాదవ పాండవీయం' అనే చతురర్థీ కావ్యాన్ని రచించిన సింగరాచార్యులు అవధాన జైత్రయాత్ర చేసిన గొప్ప ఆశుకవి. దశరథ రాజ నందన చరిత్రలో " శత ఘంటావధాన ప్రసిద్ధ సాహిత్య సారస్వతాశు కవితాష్టభాషా విశేషుడ" నని తనకు తాను చెప్పుకున్నాడు. తద్వారా ఈయనకు అష్టభాషా కవితా విశారద, అశుకవి, శతఘంటావధాన, అనే బిరుదులున్నాయని తెలుస్తుంది. మహబూబునగరు జిల్లా అమరచింత సంస్థానంలో విద్వత్కవిగా పేరొందిన బుక్కపట్నం శ్రీనివాసాచార్యులు అష్టభాషా విశారదుడు. శతఘంటకవనం చెప్పడంలో అనన్య సామాన్య ప్రతిభాసంపన్నుడు. ఆత్మకూరులో 'బ్రహ్మామతవర్షిణి' అన్న వేదాంతసభ స్థాపించాడు. రాజవంశ రత్నావళి, దుర్మథన నిదర్శనము, రాజశేఖర చరిత్రము,నందరాజు చంపువు, తత్త్వ మార్తాండ ప్రభాపటలము, శ్రీనివాసవిలాసము, దుర్విగ్రహ నిగ్రహము మొదలైన రచనలు చేశారు. తర్కతీర్థ, బాలసరస్వతి అనే బిరుదులున్న వీరు ఉత్తరభారతమంతా పర్యటించి తన ప్రతిభప్రదర్శించి, వివిధ సంస్థానాల నుండి జయపత్రాలను అందుకొన్నారు. వీరికి తిరుపతి వేంకట కవులకు వాగ్వాదం జరిగింది. అనేకవిద్వత్సభల్లో జయకేతనం ఎగురవేసిన శ్రీనివాసాచార్యులు ప్రాకృతం, పైశాచి, సంస్కృతం మున్నగు ఎనిమిది భాషల్లో ఆశు కవితా విన్యాసం ప్రదర్శించేవారు. నాటి బ్రిటిషుప్రభుత్వం వీరిని శ్వేతపత్రం, చామరం, ఆందోళికలతో సత్కరించింది. చతుర్విధకవితానైపుణ్యం కల యాయవరం రామశాస్త్రి,అష్టావధానిగా లబ్ధప్రతిష్ఠులు. గురుస్తుతి, దేవీయమకతారావళి, రాజేశ్వర తారావళి,కుమార సల్లాపము, చుంచనకోట దేవి అఖండనామావళి, మున్నగు రచనలు చేశాడు. ఈయన పద్యనిర్మాణశైలి సంస్కృత పద భూయిష్టమై అలరారింది. భక్తిభావగరిమ ప్రతి రచనలోనూ అణువణువున కనిపిస్తుంది. ఏకాక్షరులు, ద్వ్యక్షరుల శ్లోకాలు వీరిప్రతిభకు గీటురాయి. చిత్రకవితా నేర్పరులైన వీరు 'అభినవతిక్కన', 'శ్లేషయమక చక్రవర్తి' గా లబ్ధప్రతిష్ఠులు. విద్వత్కవిగా కీర్తినొందిన అవధాని నాగవీరేశ్వర శాస్త్రి సంస్కృత శివపురాణాన్ని ఆరువేల పైచిలుకు పద్యాలతో తెలుగులోకి 'శివపురాణం' పేరిట అనువదించారు. శ్రీశైల భ్రమరాంబికను కీర్తిస్తు రాసిన 'భ్రామరి' కావ్యం పలువురి మన్ననలందుకుంది. శతావధానులు శేషాద్రి రమణకవులుగా పేరొందిన దూపాటి శేషాచార్యులు దూపాటి వేంకటరమణాచార్యులు (ఈ ఇరువురు సోదరులు) తెలంగాణ వ్యాప్తంగా అవధాన జైత్రయాత్ర చేశారు. సురవరం ప్రతాపరెడ్డిగారికి, కొమర్రాజు వారికి, జయంతి రామయ్యపంతులు గారికి, చారిత్రిక సాహిత్య పరిశోధనకు కొంత సహకరించారు. కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తుకోసం తెలంగాణ జిల్లాలు పర్యటించి తాళపత్ర, శాసన ఆధారాలు సేకరించి సమర్పించారు. వీరు జంట అవధాను లేకాదు, సంయుక్తంగా రచనలు చేయడం కూడా విశేషమే. నిజాము రాష్ట్ర ప్రశంస, వ్యాకరణసర్వస్వము, ఆంధ్రమంత్రులు, వసుంధర, గుణవతీవిలాసము, క్షత్రియుల దర్పణము, కొండపల్లి ముట్టడి మున్నగు రచనలను వివిధప్రక్రియల్లో రచించారు. కరీంనగర్ జిల్లా మానకొండూరులో ఒక శతావధానంలో ఒకసారి పృచ్ఛకులుగా పాల్గొన్నారు విఠాల చంద్రమౌళిశాస్త్రి. ఆ శతావధాన పద్యాలను అన్నీ ధారణచేసి చెప్పటంతో అక్కడి అవధాని 'శతావధాని' అని ఈయనను కీర్తించారు. నాటి నుండి శతావధానిగా మారి అనేక అవధానాలు చంద్రమౌళి శాస్త్రి నిర్వహించారు. బాసర జ్ఞానసరస్వతీదేవి సన్నిధిలో తపస్సుచేసి వాణి అనుగ్రహంతో కవిత్వ రచన ఆరంభించారు. మాతృసేవ, శ్రీలీల లిలతాలాపము, కుమారసల్లాపము మున్నగు రచనలు చేశారు. గద్వాల నివాసి శతావధాని పుల్లగుమ్మి వేంకటాచార్యులు సంస్థాన పాలకుడు రాజా సీతారామ భూపాలరావు గారి విద్యా గురువుగా లబ్ధప్రతిష్ఠుడు. గద్వాల సంస్థాన ఆస్థానకవి, ధర్మాధికారి కూడా. ఆదిలక్ష్మీకర్ణపూరము, ఆంధ్ర వ్యాకరణ సూత్రావళి, ఆలంకారికావళి ఈయన రచనలు. దప్పూరి సత్యనారాయణా చార్యులు, చింతామణి నరసింహాచార్యులు, బెల్లంకొండ నరసింహాచార్యులు, త్రిగుళ్ళ కృష్ణ శాస్త్రి, తిరువరంగం పాపయ్యశాస్త్రి, వీరవెల్ల నృసింహాచార్యులు, గౌరీభట్ల నారాయణశాస్త్రి, రుక్మాభట్ల రాజమౌళి శాస్త్రి,శాస్త్రుల విఠాల శర్మ తదితర అవధానులెందరో పందొమ్మిదోశతాబ్ది తెలంగాణ అవధాన సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

(ఇంకా ఉంది.. మిగతా భాగం వచ్చేవారం ( 27 మార్చి 2026 సంచికలో..)

రచయితలకు ఆహ్వానం!
సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..
అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by BOMMAKANTI SHRAVAN KUMAR from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by BOMMAKANTI SHRAVAN KUMAR and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.